
చోడవరంలో వర్షం


# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025


# ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం

**పలు మండలాల్లో కుండపోతగా వాన**

- పంట కాలువలను తలపించిన రహదారులు


చోడవరంలో భారీ వర్షం పడడంతో చెరువును తలపిస్తున్న చీడికాడ రోడ్డు

అనకాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా వుంది. మధ్యాహ్నం తరువాత వాతావరణం పూర్తిగా మారిపోయింది. పలు మండలాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. అనంతరం ముసురు వాతావరణం కొనసాగింది. చోడవరం, చీడికాడ, పరవాడ, కె.కోటపాడు, సబ్బవరం మండలాల్లో భారీ వర్షం కురవగా.. మాడుగుల, రావికమతం, దేవరాపల్లి, మునగపాక మండలాల్లో మోస్తరు వర్షం పడింది. నర్సీపట్నం, అనకాపల్లి, కశింకోట, అచ్యుతాపురం, గొలుగొండ, ఎలమంచిలి మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరిపైరుకు ఎంతో ఉపయోగపడతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా కె.కోటపాడు మండలం ఆర్లై అగ్రహారంలో పిడుగుపడడంతో ఎంపీటీసీ సభ్యుడు యడ్ల పైడింనాయుడుకు చెందిన గేదె మృతిచెందింది.

### చోడవరంలో వాగుల్లా మారిన రోడ్లు

చోడవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. రెండు గంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం నాలుగు గంటల వరకు దంచి కొట్టింది. పట్టణంలోని రహదారులన్నీ వర్షం నీటితో వాగుల్లా మారాయి. బాలాజీనగర్, బానయ్యకోనేరు, చీడికాడ రోడ్డు చెరువును తలపించాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లపై ప్రవహించడంతో పలుచోట్ల బురద, చెత్తాచెదారం పేరుకుపోయింది. ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా భారీ వర్షం కారణంగా చోడవరంలో కొంతసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది


పరవాడలో వర్షం

### పరవాడలో..

పరవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరవాడ, పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నరపాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారుల పై వర్షం నీరు పారింది. చెరువుల్లోకి సమృద్ధిగా ... మిగతా 8వ పేజీలో


లారీలో నుంచి యూరియా బస్తాలను దించుకున్న కలాసీలు

# పుష్కలంగా యూరియా

**జిల్లాకు మరో 900 టన్నులు చేరిక**

- ఆర్‌ఎస్‌కేలు, పీఏసీఎస్‌లకు 630 టన్నులు సరఫరా
- రేపటి నుంచి రైతులకు పంపిణీ
- ప్రైవేటు డీలర్లకు 270 టన్నులు
- విజయనగరం నుంచి మరో 300 టన్నుల యూరియా వస్తుందని అధికారులు వెల్లడి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)


**రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాకు మంగళవారం నాటికి 13,857 టన్నుల యూరియా సరఫరా అయ్యింది. తాజాగా 900 టన్నుల యూరియా రాగా ఇందుల్లో 270 టన్నుల ఎరువును ప్రైవేటు డీలర్లకు కేటాయించారు. మిగిలిన 630 టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్ ద్వారా రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు సరఫరా చేసి రైతులకు పంపిణీ చేయనున్నారు.**

యూరియా కృత్రిమ కొరతకు చెక్ పెట్టాలని, అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు.. జిల్లా వ్యవసాయాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్ నేతృత్వంలో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు యూరియా సరఫరా, పంపిణీపై నిఘా పెట్టారు. కొన్ని పీఏసీఎస్‌లకు కేటాయించిన ఎరువులు పక్కదారి పట్టడం, స్థానిక నాయకులు తమకు కావాల్సినన్ని యూరియా బస్తాలు తీసుకెళ్లడం, ఒక రైతుకు ఐదు నుంచి పది బస్తాల యూరియా ఇవ్వడం వంటి అక్రమాలను గుర్తించారు. ప్రత్యేక నిఘా బృందాల తనిఖీలతో ఇటువంటి ... మిగతా 8వ పేజీలో

# హైడ్రో పవర్‌పై అపోహలు

**ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా మన్యానికి రెండు ప్రాజెక్టులు మంజూరు**

- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుజ్జెలి, చిట్టంవలస ప్రాంతాల్లో ఏర్పాటు
- 2,300 మెగావాట్‌ల సామర్థ్యం
- ఇతర ప్రాంతాల నుంచి నీరు...
- గ్రామాల ముంపు అపోహ మాత్రమే
- భారీగా పెరగనున్న ఉపాధి అవకాశాలు


హైడ్రో పవర్ ప్లాంట్ ఊహా చిత్రం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో అదనపు విద్యుత్ అందుబాటులోకి రావడమే కాకుండా స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి. 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024'లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అనంతగిరి మండలం గుజ్జెలిలో 1,500 మెగావాట్లు, చిట్టంవలసలో 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఇవి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కావడం గమనార్హం. అంటే వర్షాకాలంలో అందుబాటులో ఉన్న నీటిని ఉపయోగించుకుంటూ, అదనంగా ఉన్న నీటిని నిల్వ చేసుకుంటాయి. అవసరమైన చోట్ల డ్యామ్‌లు, రిజర్వాయర్లు నిర్మిస్తాయి. ఆ నీరు విద్యుదుత్పత్తికి సరిపోని సందర్భాల్లో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి పంపింగ్ చేసుకుంటాయి. అందుకే వీటిని పంప్డ్ హైడల్ ప్రాజెక్టులుగా వ్యవహరిస్తున్నారు.

### ముంపు సమస్య అపోహ మాత్రమే

ఈ రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల కారణంగా హుకుంపేట, అరకులోయ, అనంతగిరి మండలాల్లోని ఎనిమిది పంచాయతీల్లో పలు గ్రామాలు ముంపునకు గురవుతాయని గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. అయితే ఇతర ప్రాంతాల నుంచి నీటిని రప్పించడం వల్ల ముంపు సమస్య ఎదురుకాదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులన్నీ శాస్త్రీయంగా, ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో, పద్ధతి ప్రకారం చేపడతారని, అపోహలు పెంచుకోవద్దని సూచిస్తున్నారు. డ్యామ్‌లు, రిజర్వాయర్ల నిర్మాణం నైపుణ్యం కలిగిన ఇంజనీర్‌ల పర్యవేక్షణలో జరుగుతుందని పేర్కొంటున్నారు. వీటివల్ల పర్యావరణానికి గానీ, ఆయా ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గిరిజనులకు గానీ ఎటువంటి ఇబ్బందులు ఎదురు కావని భరోసా ఇస్తున్నారు. వేరే ప్రాంతం నుంచి నీటిని రప్పించడం వల్ల స్థానిక జల వనరులకు ముప్పు రాదని కూడా చెబుతున్నారు. ఈ విషయాల్లో ఆందోళన తగదని, స్థానిక గిరిజనులకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా చర్యలు చేపడతామని అంటున్నారు. అంతేగాకుండా వీటివల్ల ఏజెన్సీలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విద్యుత్ ఆధారిత పరిశ్రమలను గిరిజనులు కూడా ఏర్పాటుచేసుకునే అవకాశం లభిస్తుందని అంటున్నారు. రెండు ప్రాజెక్టుల నిర్మాణంతో కొన్ని సంవత్సరాల పాటు వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. అవి పూర్తయ్యాక నైపుణ్యం కలిగిన వారికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. చదువుకున్న గిరిజన యువతకు విద్యుత్ ప్రాజెక్టుల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఇంకా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయి. వాటిలోను ... మిగతా 8వ పేజీలో

## ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అశ్వవాహనంపై శ్రీవారి తిరువీధి సేవ

నక్కపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారి నిజరూపానికి, కింద ఆలయంలో వున్న ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా మాడవీధుల్లో కావడి ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి అశ్వావాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరిగింది.

## నూకాంబిక అమ్మవారికి పట్టుచీరలు సమర్పించిన కలెక్టర్

- ఆలయాల్లో వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవార్లు


బాల త్రిపురసుందరీదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ


నూకాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్. పక్కన ఈవో సుధారాణి, ఆర్డీఓ ఆయిషా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి, కలెక్టర్ విజయకృష్ణన్ 11 పట్టు చీరలను సమర్పించారు. ఆలయం మండపంలో శ్రీచక్ర మెరుపునకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో షేక్ ఆయిషాలను ఆలయ ఈవో కేవీల్ సుధారాణి, ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గ అమ్మవారు బాల త్రిపురసుందరిదేవిగా, గౌరీ పంచాయతన ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

# ఇళ్ల బిల్లులకు నిరీక్షణ

**'పట్నం నియోజకవర్గంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం బకాయిలు రూ.4.69 కోట్లు**

- 2014-19 మధ్య టీడీపీ హయాంలో 3,541 ఇళ్లు మంజూరు
- ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షలు కేటాయించిన ప్రభుత్వం
- చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి, బిల్లుల చెల్లింపు
- 2019లో మారిన ప్రభుత్వం
- మిగిలిన లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వని వైసీపీ పాలకులు
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సర్వే చేసిన ప్రభుత్వం
- రూ.4.69 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు నిర్ధారణ
- నిధులు త్వరగా విడుదల చేయాలని లబ్ధిదారుల వినతి


గొలుగొండ మండలం జోగుంపేటలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించుకున్న ఇల్లు

నర్సీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):

**ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న వందలాది మంది లబ్ధిదారులు బిల్లుల కోసం ఆరేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు నర్సీపట్నం నియోజకవర్గంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంకా నాలుగున్నర కోట్ల రూపాయలకుపైగా బిల్లులు అందాల్సి వుంది.**

సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు గత టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.5 లక్షల చొప్పున మంజూరు ... మిగతా 8వ పేజీలో

# వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

**జిల్లాలో జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఐదుగురు మృతిచెందారు. ఒక బాలుడు గెడ్డలోపడి గల్లంతయ్యాడు. ఎస్.రాయవరం మండలంని గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో వ్యాన్ ఢీకొనడంతో కొబ్బరికాయల వ్యాపారి మృతిచెందాడు. నర్సీపట్నంలో ఒక ద్విచక్ర వాహన షోరూమ్‌లో వాటర్ సర్వీసింగ్ చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పరవాడ మండలం ధర్మారాయుడుపేట జంక్షన్‌కు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఢీకొనడంతో అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామానికి చెందిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం అర్ధరాత్రి అనకాపల్లి ఉడ్‌పేట వద్ద డ్రైనేజీలో పడి వ్యక్తి బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి గ్రామానికి చెందిన వ్యక్తి చనిపోయాడు. నాతవరంలో తాండవ ఎడమ కాలువలో స్నానానికి దిగిన యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట తాచేరు కాజ్‌వే వద్ద వరద ప్రవాహంలో పడి ఎనిమిదో తరగతి విద్యార్థి గల్లంతయ్యాడు.**

## తాచేరు గెడ్డలో పడి విద్యార్థి గల్లంతు


సోమిరెడ్డి నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)


దుండు తేజ (ఫైల్ ఫొటో)


దన్నిన వంశీ (ఫైల్ ఫొటో)


కొల్లి బాబురావు (ఫైల్ ఫొటో)


ఆడారి రోహిత్ (ఫైల్ ఫొటో)

### వ్యాన్ ఢీకొని కొబ్బరి కాయల వ్యాపారి మృతి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొబ్బరికాయల వ్యాపారి మృతిచెందాడు. ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన సోమిరెడ్డి నాగేశ్వరరావు (58), విశాఖలో నివాసం వుంటున్న తన తమ్ముడు శ్రీనుతో కలిసి కొబ్బరి తోటలను లీజుకు తీసుకొని కొబ్బరికాయల ... మిగతా 8వ పేజీలో

# గంజాయి నియంత్రణకు ఉమ్మడి వ్యూహం

**ఏపీ, ఒడిశా పోలీసుల కీలక నిర్ణయం**

**జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇరు రాష్ట్రాల అధికారులు**


జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇరు రాష్ట్రాల అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఏపీ, ఒడిశా పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి వ్యూహంతో దీనికి అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆలోచనల మేరకు మంగళవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో రెండు రాష్ట్రాల ఉన్నతస్థాయి పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశాన్ని ప్రధానంగా సరిహద్దు సమస్యలను పరిష్కరించేందుకు, సహకార యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి వీలుగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ పరిధిలో నిర్వహించిన ... మిగతా 8వ పేజీలో

## మత్స్యకారుని గల్లంతుపై త్రిసభ్య కమిటీ విచారణ



పూడిమడకలో విచారణ జరుపుతున్న అధికారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జూలై రెండున సముద్రంలో మత్స్యకార యువకుడు చోడిపల్లి ఎర్రయ్య గల్లంతుపై మంగళవారం త్రిసభ్య కమిటీ విచారణ జరిపింది. తహశీల్దార్ జి సత్యనారాయణ, సీఐ నమ్మి గణేష్, జిల్లా మత్స్యశాఖ అధికారిణి విజయ విచారణ జరిపారు. గల్లంతయినట్టు త్రిసభ్య కమిటీ మరణ ధ్రువీకరణ పత్రం వచ్చిన తర్వాతే ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుంది. ఈకార్యక్రమంలో వాసుపల్లి అప్పారావు, మేరుగు రాజుబాబు, ప్రవీణ్, వీఆర్వో అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, మృతుని తల్లి మాయావతి, ధోని ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయండి

నక్కపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందనాడ శివారు పాటిమీద గ్రామంలో ఈనెల 27న ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం విశాఖలోని కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఇంజనీర్ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. భూములిచ్చిన నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయకూడదని, వాయిదా వేయాలని కోరారు.

## బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయండి



మోకాళ్లపై కూర్చొని ప్రదర్శన చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుతో తమ ఉపాధి దెబ్బతింటుందని, అందువల్ల వెంటనే రద్దు చేయాలని రాజయ్యపేట మత్స్యకారులు డిమాండ్ చేశారు. మంగళవారం నిరసన శిబిరంలో మత్స్యకారులు మోకాళ్లపై కూర్చొని, ప్లకార్డులను మెడలో వేలాడదీస్తూ ప్రదర్శన చేశారు. ఇప్పటికే హెటిరో పరిశ్రమ కారణంగా తేరుకోలేని నష్టం కలిగిందని, ఇప్పుడు బల్క్‌డ్రగ్ ఏర్పాటు చేస్తే, ఈ ప్రాంత ఉనికే ప్రమాదకరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు స్వామిత్వ సర్వే చేయాలి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు మాత్రమే గ్రామాల్లో స్వామిత్వ సర్వే చేపట్టాలని ఎంపీడీవో మీనాకుమారి అన్నారు. మండలంలోని జేవీ పాలెంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను మంగళవారం ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. అలాగే ధర్మవరం అగ్రహారం, దార్లపూడి, భీమవరంల్లో పారిశుధ్య పనులను వారు పరిశీలించారు. పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు వారు సూచించారు.

## ఎంజే పురంలో ఘనంగా దుర్గాదేవి సారే ఊరేగింపు

అచ్యుతాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంజేపురంలో దుర్గాదేవి సారె ఊరేగింపు మంగళవారం ఘనంగా జరిగింది. దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమైన రెండో రోజు గ్రామస్థులు కొండపై వెలసిన దుర్గాదేవికి సారె సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం గ్రామస్తులు సారెను గ్రామమంతా ఊరేగించి దుర్గాదేవికి సమర్పించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈకార్యక్రమంలో భారీ సంఖ్యలో భవానీ భక్తులు నృత్యాలు చేశారు.

## పీ4తో అభాగ్యులకు భరోసా : ఎంపీడీవో

మునగపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలతోపాటు అభాగ్యులకు భరోసాగా నిలవడం లక్ష్యంగా పీ4 పథకంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంపీడీవో ఎం.ఉషారాణి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పీ4 పథకంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అభాగ్యులకు భరోసాగా నిలిచి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. మండలం వ్యాప్తంగా మే నెలలో జరిపిన సర్వే ద్వారా 1800 మందిని పీ4 లబ్ధిదారులుగా గుర్తించామన్నారు. వారికి ఏ విధమైన సేవలు అవసరమో గుర్తించామన్నారు. సమావేశంలో మండల పరిషత్ ఏవో, సచివాలయాలు సిబ్బంది పాల్గొన్నారు.

## 'డిపాజిట్లపై వడ్డీ రేటు పెంపు'

మునగపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):సేకరించిన డిపాజిట్లకు వడ్డీ రేటు పెంచుతున్నామని చూచుకొండ పీఏసీఎస్ చైర్‌పర్సన్ పెంటకోట నర్సింగరావు తెలిపారు. మంగళవారం జరిగిన చూచుకొండ సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని రకాల డిపాజిట్లకు వడ్డీని 8 శాతానికి పెంచుతున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.5.47లక్షలు నికర లాభం ఆర్జించిందన్నారు. సీఈవో ఆడారి వెంకటస్వామినాయుడు వార్షిక నివేదిక, బడ్జెట్‌ను చదివి వినిపించారు. ఈ సమావేశంలో పర్సన్‌లు పెంటకోట రఘురాం, కర్రి వెంకునాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు, కె.వీరరాజశేఖర్, కాండ్రేగుల శంకర్, కాళ్ల చంద్రమోహన్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

**▸▸ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా**

నక్కపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యం చేసే వారికి బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ప్రోత్సాహం వుంటుందని బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా చెప్పారు. మండలంలోని జానకయ్యపేటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించే రైతులకు డ్రమ్ములు, క్యాన్లు పంపిణీ చేశారు. జీవామృతం, నీమాస్త్రం వంటి వాటిని ఎలా తయారు చేసుకోవాలో ఆమె వివరించారు. వరి, జీడి, మామిడి, కొబ్బరి తోటల సాగులో కూడా ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవి, కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, ఏఈవో సత్యనారాయణ, గ్రామ పెద్దలు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

**▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్**

మునగపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అద్భుతమైన సంక్షేమ పథకాలను అందజేస్తోందని, వాటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ శాఖ సమావేశాలు నిర్వహించి, పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఆడారి మంజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఉల్లింగల గోవింద, సబ్బి కృష్ణ, ఉల్లింగల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అలరిస్తున్న అమ్మవార్ల విగ్రహాలు

**▸▸ పెదపల్లి రైల్వే గేటు వద్ద రిక్షాలో దుర్గమ్మ వెళుతున్నట్టు ఏర్పాటు**

**▸▸ అల్లూరి సీతారామరాజు కాలనీలో ఊయలలో దుర్గాదేవి విగ్రహం ఏర్పాటు**

**▸▸ భారీగా దర్శిస్తున్న భక్తులు**



పెదపల్లి రైల్వే గేటు వద్ద విశేషంగా ఆకట్టుకుంటున్న రిక్షాలో దుర్గామాత అమ్మవారు



ఏఎస్ఆర్ కాలనీలో ఆకర్షణగా నిలిచిన ఊయలలోని అమ్మవారు

ఎలమంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన అమ్మవార్ల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెదపల్లి రైల్వేగేటు వద్ద అమ్మవారి రిక్షాలో వెళుతున్నట్టు తయారు చేసిన విగ్రహం పట్టణంలో ప్రత్యేకత సంతరించుకుంది. అదేవిధంగా పట్టణంలో అల్లూరి సీతారామరాజు కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో ఊయలలో అమ్మవారు ఊగుతున్నట్టు ఏర్పాటు చేసిన విగ్రహం ఆకట్టుకుంది. ఈ రెండు చోట్ల ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలను చూసి తరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.



## గాయత్రిదేవిగా అమ్మవారు

అచ్యుతాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చోడమాంబికా అమ్మవారి ఆలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు గాయత్రిదేవి అలంకరణలో చోడమాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆశాజనకంగా సాగని పంచాయతీ షాపుల వేలం

**▸▸ రూ. పది వేలు పెరిగిన క్యాంటీన్ అద్దె**

**▸▸ మిగిలిన షాపులకు నామమాత్రమే**

**▸▸ నాలుగు షాపుల వేలం వాయిదా**



పంచాయతీ షాపులు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీ షాపులకు మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలంలో క్యాంటీన్ రూ.40,100కి పాట వెళ్లింది. పంచాయతీకి చెందిన 15 షాపులకు వేలం పాటలు నిర్వహించగా.. వీటిలో ఒక్క క్యాంటీన్‌కు మాత్రమే అద్దె రూ.పదివేలు పెరగ్గా.. మిగిలిన షాపులకు అద్దె నామమాత్రంగానే పెరిగింది. గౌతమ్ థియేటర్ ఎదుట ఉన్న 2వ నంబరు షాపుతోపాటు చిత్రమందిర్ థియేటర్ ఎదుట ఉన్న మూడు షాపులకు అప్‌సెట్ ప్రైస్ కంటే తక్కువకు వెళ్లడంతో వేలం పాటలను వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. వేలం పాటలు ఖరారైన వాటిలో క్యాంటీన్‌కి ఇప్పటివరకు నెలకు రూ.30,648 ల అద్దె చెల్లిస్తుండగా.. సుమారు రూ.10వేలు పెరిగి రూ.40,100లకు వెళ్లింది. గౌతమ్ థియేటర్ ఎదుట ఉన్న షాపుల్లో ఐదు షాపులకు అద్దె ఖరారైంది. ఒకటో నంబరు షాపునకు రూ.13 వేలు, 3వ షాపునకు 12,500లు, 4వ షాపునకు రూ.13,200, 5వ షాపునకు రూ.13 వేలు, 6వ షాపునకు రూ.20,500లకు పాట వెళ్లింది. ఇక చిత్రమందిర్ థియేటర్ ఎదుట ఉన్న 8 షాపుల వేలం పాటలు పరిశీలిస్తే... వీటిలో 1, 3, 7వ నంబర్ల షాపుల పాట వాయిదా పడగా.. మిగిలిన వాటిలో 2వ షాపునకు రూ.10,400, 4వ షాపునకు 17,600, 5వ షాపునకు రూ.14,500, 6వ షాపునకు రూ.10,000, 8వ షాపునకు రూ.9,500కి పాట వెళ్లింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం షాపుల్లో ఉన్నవారు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ఖాళీ చేసి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం పాడుకున్నవారికి వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీన షాపులను అప్పగిస్తామని, అప్పటి నుంచి ఏడాది పాటు అద్దెకివ్వడం జరుగుతుందన్నారు. వేలం పాటకు ఎస్‌ఐ పురుషోత్తం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు షాపుల వేలం పాటలు ప్రశాంతంగా జరిగాయి.

## అడ్డరోడ్డు తిమ్మాపురంలో నేడు డీఎస్సీ అభ్యర్థులకు భోజనాలు



భోజనాల ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఈవో, డిప్యూటీ డీఈవో

ఎస్.రాయవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్వహించే కార్యక్రమంలో నియామక పత్రాలు అందుకోవడం కోసం బుధవారం వెళుతున్న డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఎక్కడికక్కడ భోజనాల ఏర్పాటు చేస్తున్నది. ఇందులో భాగంగా విశాఖ ఉమ్మడి జిల్లా నుంచి 30 బస్సుల్లో వెళుతున్న 900 మందికి అడ్డరోడ్డు తిమ్మాపురంలో గల శ్రీఆదర్శ స్కూల్లో భోజనాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి మంగళవారం సాయంత్రం భోజనాలు ఏర్పాటు చేసే ప్రదేశంతో పాటు బస్సులను నిలిపేందుకు స్థలాన్ని డీఈవో అప్పారావునాయుడు, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు పరిశీలించారు.

## ఎలమంచిలిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఎలమంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంలోని అన్ని ప్రాంతాలకు మంగళవారం మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాను ఏపీఈపీడీసీఎల్ అధికారులు పునరుద్ధరించారు. ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం ధాటికి పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. దీంతో రెండు రోజులుగా పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేక అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు రోజులుగా నీరు లేకపోవడంతో ప్రయాణికులు మల,మూత్రాల విసర్జనకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బస్టాండ్‌లో రాత్రి విధులు నిర్వర్తించే డ్రైవర్లు, కండక్టర్లు దోమలతో యుద్ధం చేశారు. కండక్టర్ల టికెట్ మిషన్లకు చార్జింగ్ పెట్టుకునేందుకు కూడా అవకాశం లేకపోయింది. ఎట్టకేలకు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## ఈ-పంట నమోదు వేగవంతం : ఏడీఏ జాహ్నవి

ఎలమంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సబ్ డివిజన్ పరిధిలోని రైతాంగం ఈ-పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జాహ్నవి అన్నారు. మంగళవారం పురుషోత్తపురం, రుక్మిణిపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులకు సూచనలు చేశారు. ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు జరిగినా.. పంట కొనుగోలు చేసినా ఇన్సూరెన్స్ వర్తించాలన్నా.. ఈ-పంట నమోదు విధిగా చేసుకోవాలన్నారు. అక్టోబరు మొదటి వారంలోగా ఈప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. మండలంలో షేకిళ్లపాలెం, ఏటికొప్పాక, కృష్ణాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 40 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ మండలంలో ముదురు నారు ఊడిచిన రైతులు యూరియాను దఫదఫాలుగా కొంచెం ఎక్కువ మోతాదు వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా దోమపోటు తగ్గడానికి పొటాష్ ఎరువు వినియోగించుకోవాలన్నారు. దోమపోటు, పాసి తెగులు ఉన్నట్లయితే హెక్సా కొనసాల్, ఎసిఫేట్ లేదా, మోనోక్రోటోఫాస్ లాంటి పురుగు మందులు ఒక ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

## యువత రక్తదానం చేయడం అభినందనీయం

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్**



రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న ఆడారి ఆనంద్

ఎలమంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఆడారి ఆనంద్, చైర్‌పర్సన్ రమాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలిపేందుకు ప్రధాని మోదీ ఎంతో ప్రణాళికాబద్ధంగా పాలన సాగిస్తున్నారన్నారు. బీజేపీకి ఆదరణ పెరుగుతుందని, పార్టీ శ్రేణులంతా సమిష్టిగా ఉంటూ ప్రజలతో మమేకం కావాలన్నారు. ఈ శిబిరంలో 120 మంది రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆడారి శ్రీధర్, సుందరపు బాబ్జీ, మళ్ల కొండబాబు, పప్పు ఈశ్వరరావు, కౌన్సిలర్ బీబీ, ఆనంద్ అభిమానులు పాల్గొన్నారు.

## బొనూకొత్తూరులో గిరిజనులకు దోమతెరలు పంపిణీ



బొనూకొత్తూరులో గిరిజనులకు ఉచితంగా దోమతెరలు పంపిణీ చేస్తున్న అధికారులు

కోటవురట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే వెంకటాపురం పంచాయతీ బొనూకొత్తూరులో 21 గిరిజన కుటుంబాలకు దోమ తెరలను అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు. మంగళవారం బొనూకొత్తూరులో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు తిరుమలరావు ఇంటింటికి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ కొండల మధ్యలో నివాసం ఉంటున్న గిరిజనులకు సీజనల్ వ్యాధులు బారిన పడుతున్నారన్నారు. ప్రతి ఏడాది మలేరియా జ్వరాలు సోకే ప్రమాదం ఉన్నందున గిరిజనులకు దోమలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గిరిజనులు దోమ తెరలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# ప్రయోజనకర స్థలాలను డంపింగ్‌కు వాడకండి : డీపీవో సందీప్



చేపల విక్రయాల తరువాత చేయాల్సిన శుభ్రతపై వివరిస్తున్న సందీప్

మునగపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రయోజనకర స్థలాలను డంపింగ్‌లకు వినియోగించవద్దని జిల్లా పంచాయతీ శాఖాధికారి సందీప్ అన్నారు. మంగళవారం మండలంలోని తోటాడ గ్రామంలో పలు వీధులు, ప్రాంతాల్లో పర్యటించి, అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించారు. మురికి నీరు పోయేందుకు అవకాశం ఉన్న వైపు డ్రైనేజీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం మంచిది కాదన్నారు. ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ గోడలు, మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తోటాడ పంచాయతీకి తక్కువ వచ్చాయని సర్పంచ్ దొడ్డి మంగవేణి డీపీవో దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ సోమరాజు, దొడ్డి కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పొలమరశెట్టి మరళి, దొడ్డి రమేష్ తదితరులు ఉన్నారు.

## ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలి



పాములవాకలో వైద్యశిబిరం నిర్వహించిన వేములపూడి సీహెచ్‌సీ సిబ్బంది

కోటవురట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించారని, ఇందుకోసం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను రూపకల్పన చేసినట్టు వేములపూడి పీహెచ్‌సీ డాక్టర్ అనూష తెలిపారు. మంగళవారం పాములవాకలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ డి. సత్యవతి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 180 మంది మహిళలు, బాలికలకు రక్తహీనత, నోటి క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు, బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్ పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోటవురట్ల సహకార సంఘం అధ్యక్షుడు వేచలపు జనార్దన్, వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**అచ్యుతాపురంలో..**

మహిళలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావ్య అన్నారు. మంగళవారం వెదురువాడలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు, రమేష్‌బాబు, లాలం శ్రీనివాస్, గొర్లె నూకరాజు, రాజేష్ వర్మ, కొయ్య మహలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 13 మంది ఒడిశా వలస కార్మికులు స్వగ్రామాలకు తరలింపు

రాంబిల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెమికల్ పరిశ్రమలో పనిచేస్తున్న 13 మంది ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికులను స్వగ్రామాలకు పంపించినట్టు ఎలమంచిలి కార్మిక శాఖ అధికారి బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాష్ట్ర వలస కార్మికుల సహాయ కేంద్రానికి అందిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎమ్. వెంకట శేషగిరిబాబుల ఆదేశాల మేరకు మండలంలోని ఓ కెమికల్ పరిశ్రమలో పనిచేస్తున్న 13 మంది వలస కార్మికులను గుర్తించామన్నారు. వీరందరికీ వారి యజమాని నుంచి రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించారని, అనంతరం వారిని రైలులో ఒడిశాలోని వారి స్వగ్రామాలకు తరలించామన్నారు.

## ఎలమంచిలి ఏఎంసీ డైరెక్టర్‌గా గోవిందరెడ్డి



ఎలమంచిలి ఏఎంసీ డైరెక్టరుగా ఉత్తర్వులను అందుకుంటున్న ధర్మాల వరాహ గోవిందరెడ్డి

రాంబిల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరుగా మండలానికి చెందిన ధర్మాల వరాహ గోవిందరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సమిష్టి కృషితో మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. గోవిందరెడ్డి ప్రస్తుతం బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

## పిడుగు పడి పాడి గేదె మృతి

కె.కోటపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆర్‌వై అగ్రహారంలో మంగళవారం పిడుగు పడి పాడి గేదె మృతి చెందింది. మధ్యాహ్నం ఒంటిగంటన్నర ప్రాంతంలో పిడుగు పడడంతో మండలంలోని ఆర్‌వై అగ్రహారం ఎంపీటీసీ సభ్యుడు యడ్ల పైడినాయుడుకు చెందిన గేదె మృతి చెందింది. పాడి గేదె విలువ రూ.70వేలు ఉంటుందని రైతులు తెలిపారు. పశువైద్యులు పంచనామా నిర్వహించారు.

## వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ఎలమంచిలి బృందం భజన కీర్తనలు



తిరుమలలో భజనలు చేస్తున్న భూలోకమాంబ మహిళలు

ఎలమంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎలమంచిలి శ్రీభూలోకమాంబ భజన బృందం సభ్యులు మంగళవారం భజనలు చేశారు. ఎలమంచిలి తులసినగర్‌కు చెందిన శ్రీభూలోకమాంబ భజన బృందం సభ్యులు 12 ఏళ్ల క్రితం బ్రహ్మోత్సవాల్లో భజనలు చేసేందుకు అవకాశం కల్పించమని టీటీడీకి వినతిపత్రాన్ని పంపింది. దీంతో ప్రాధాన్యతా క్రమంలో ఈసారి బ్రహ్మోత్సవాల్లో భజనలు చేసేందుకు టీటీడీ తమను ఆహ్వానించిందని భజన బృందం సభ్యులు తెలిపారు. దీంతో మంగళవారం స్వామి సన్నిధిలో 12 మంది మహిళలు భజన కీర్తనలు ఆలపించినట్టు శ్రీ భూలోకమాంబ భజన బృందం ప్రతినిధి మళ్ల కొండబాబు తెలిపారు. తమ బృందానికి చైర్‌పర్సన్ రమాకుమారి సహకారంతో ప్రోత్సాహం దక్కిందని ఆయన తెలిపారు.

## పాఠశాల పక్కన చెత్త తొలగింపు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్టు**

రాంబిల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకివాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలోని రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించడంతో ఈ ప్రదేశం సర్వాంగ సుందరంగా తయారైంది. ఈనెల 19వ తేదీన 'పాఠశాల పక్కనే చెత్త' అన్న వార్తకు అధికారులు స్పందించారు. చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించి బ్లీచింగ్ పిచికారీ పనులు చేపట్టడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆకట్టుకున్న నాటికలు

▶▶ 'జనరల్ బోగీలు'.., 'మమ్మల్ని బతకనివ్వండి'లలో

ప్రేక్షకులను మెప్పించిన కళాకారులు



జ్యోతి ప్రజ్వల చేసి నాటికల ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుబ్రహ్మణ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గౌరీ సంఘం ఆధ్వర్యంలో కర్రి రమేష్ వేదికపై ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ప్రముఖ వర్తకులు పెంటకోట సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కొలకలూరుకు చెందిన సాయి ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'జనరల్ బోగీలు', అనంతరం విజయవాడ సాంస్కృతిక సమితి ప్రదర్శించిన 'మమ్మల్ని బతకనివ్వండి' నాటికలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు అద్భుతంగా నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. సందేశాత్మకంగా సాగిన ఈ ప్రదర్శలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కర్రి సన్యాసినాయుడు, భీమరశెట్టి వరహా నూకరాజు, కొణతాల మురళీకృష్ణ, వేదుల శివాజీ, కేఎం నాయుడుతో పాటు కనకదుర్గమ్మ ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



జనరల్ బోగీ నాటికలో ఓ సన్నివేశం

## ఉత్సవాల్లో నిబంధనలు విధిగా పాటించాలి : సీఐ



ఉత్సవాల నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శరన్నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. అనకాపల్లిలోని వివిధ ప్రాంతాల్లో మండలపాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. మైక్‌లను ఇష్టానుసారంగా ఉపయోగించి శబ్దకాలుష్యానికి కాల్పడవద్దన్నారు. చుట్టుపక్కల నివసించేవారు ఇబ్బందులు పడకుండా తక్కువ సౌండ్‌తో భక్తిగీతాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి పది లోపు మాత్రమే మైక్‌లు వినియోగించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## రేషన్ సరకులు పూర్తిస్థాయిలో అందించాలని వినతి



తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలో గల టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న వారికి పూర్తిస్థాయిలో రేషన్ సరకులు అందేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె స్థానిక మహిళలతో కలిసి తహశీల్దార్ బి.నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. రేషన్ సరకులు పూర్తిగా సరఫరా లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీవాసులంతా తక్షణమే మ్యాపింగ్ చేయించుకోవాలని తహశీల్దార్ వారికి సూచించారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులందరికీ రేషన్ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు బంగారమ్మ, మాణిక్యం, సరోజిని, లక్ష్మమ్మ, వరలక్ష్మి, మంగమ్మ, కనకమహాలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయుర్వేద వైద్యంతో అద్భుత ఫలితాలు'




ఆయుర్వేద వైద్యంపై విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్

సబ్బవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.శంకర్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చునన్నారు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి ఈ వైద్య విధానం కొనసాగుతుందన్నారు. ఈ వైద్యం భారతీయ ఆహారపు అలవాట్లతో మిళితమై ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఆయుర్వేదం ఎంతో దోహదపడుతుందని వివరించారు. అందరూ ఆయుర్వేద వైద్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు రజనీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ సిబ్బంది వేతనాల పెంపు



ఎస్పీ తుహిన్ సిన్హాను కలిసి కృతజ్ఞతలు తెలిపిన బంక్‌ల సిబ్బంది

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నక్కపల్లి, చోడవరంలలో పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న సిబ్బంది గౌరవ వేతనాల పెంపునకు ఎస్పీ తుహిన్‌సిన్హా మంగళవారం ఆమోదం తెలిపారు. సీనియార్టీ ప్రాతిపదికన వేతనాల పెంపు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయా బంకుల్లో పనిచేస్తున్న సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద దుర్గమ్మకు సురేంద్ర పూజలు



పెదముషిడివాడలో పసుపు, కుంకుమలు తీసుకు వెళుతున్న భవానీలు



డైట్ కళాశాలలో నవదుర్గల వేషధారణలో విద్యార్థినులు

# జగాలనేలే తల్లికి నీరాజనం

▶▶ వాడవాడలా ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ▶▶ వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనం



నూకాంబిక ఆలయంలో శ్రీచక్ర మేరువునకు కలెక్టర్ అభిషేకం



సరస్వతీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్స వాలు వాడవాడలా అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. రెండు రోజైన మంగళవారం దుర్గామాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా అనకాపల్లి నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ 11 పట్టు చీరలను సమర్పించారు. అనంతరం ఆలయ మండపంలో శ్రీచక్ర మేరువునకు పంచామృతాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో షేక్ ఆయీషాలను ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీనులు సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు జరిపారు. విరాళ దాత ఎ.సుధీర్ హేమలత దంపతులు అన్నసమారాధనను ప్రారంభించారు.ఉత్సవ కమిటీ మాజీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధానార్చకులు భోగాపురపు వెంకటరమణ అమ్మవారిని బాల త్రిపురసుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేక రథంపై అలంకరించారు. ఈ రథం శరన్నవ రాత్రులు పూర్తయ్యే వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో భక్తుల దర్శనార్థం తిరిగిన దసరా రోజున పూడిమడక రోడ్డులోని రామాలయానికి చేరుకుంటుందని ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ తెలిపారు. అలాగే గౌరీ పంచాయతన ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సరస్వతి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో బేడా సేవ, అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. విద్యార్థులకు ఆలయ కమిటీ ప్రతినిధులు కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ గ్రంధి శేషుకుమార్‌లు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నలు పంపిణీ చేశారు. నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయంలో దసరా నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు గాయిత్రిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, స్వర్ణకార సం ఘం ప్రతినిధులు, కార్పెంటర్ సంఘం ప్రతినిధులు, విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గల నవదుర్గ శక్తి పీఠం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన మండపంలో అమ్మవారిని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ నాయకులు పోలారపు త్రినాథ్, దాడి జగన్, పైలా గోపి, ఎస్.భానుచందర్ తదితరులు దర్శించుకున్నారు. వేల్పులవీధి రజక కాలనీ, లక్ష్మీదేవిపేట కనక దుర్గమ్మ ఆలయాలతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాలు, ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదిమాతను మనసారా ఆరాధిస్తున్నారు. డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు దశావతారాలతో అమ్మ వార్లను ఏర్పాటు చేసి పూజించారు. అనంతరం నవదుర్గల వేషధారణలో మహిషాసుర మర్దని ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపారు. చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీఎల్‌సీసీ కో-ఆర్డినేటర్ షబీనా, డీన్ అకడమిక్స్ ఫణిబాబు, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

లంకెలపాలెం : శరన్నవరాత్రి ఉత్సవాలను పెద ముషిడివాడలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భవానీ భక్తులు గ్రామంలో ఏర్పాటు చేసిన మండపాల వద్దకు పసుపు, కుంకుమలతో మంగళవారం ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. సర్పంచ్ పల్లా నాగమణి, నాయకులు పల్లా అప్పారావు, యలమర్తి బుజ్జి, కలవలపల్లి సత్యనారాయణ, బొండా అచ్చి బాబు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు : డీఎంహెచ్‌వో



మాకవరంలో రోగికి అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

తుమ్మపాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ హైమావతి తెలిపారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలోని మాకవరం గ్రామంలో మంగళవారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న వైద్య సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్టు చెప్పారు. తుమ్మపాల పీహెచ్‌సీలో కూడా వైద్య సేవలు అందుతున్నాయని, అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఫ్రైడే- డ్రైడే నిర్వహణ, మాతా శిశు సంరక్షణ చర్యలు, వందన కార్డుల నిర్వహణ తదితర అంశాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.వాణిజగదీశ్వరి, హెచ్ఈవో మంగమ్మ, డీఎంఅండ్ హెచ్‌వో సీసీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొనారు.

## ఫ్లైయాష్ కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోండి

▶▶ సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి ఎమ్మెల్యే పంచకర్ల వినతి



పరవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన ఫ్లైయాష్ (బూడిద)ను రవాణా చేస్తున్న లారీల కారణంగా కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని, దీని నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మకు లేఖ రాశారు. ఫ్లైయాష్‌ను రవాణా చేసే క్రమంలో లారీల యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదని వివరించారు. బూడిద ఎగరకుండా ఉండేందుకు పైన టార్పాలిన్ కప్పాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఎవరూ చేయడం లేదని తెలిపారు. దీంతో బూడిద ఎగిరి తీవ్రమైన వాయు కాలుష్యానికి కారణమవుతుండడంతో లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, పిట్టవానిపాలెం, దేవాడ, పరవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఫ్లైయాష్‌ను పరిమితికి మించి లారీల ద్వారా రవాణా చేయడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, దీనివల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లైయాష్ వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విన్నవించారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన కోరారు.

## కార్మికుల పని గంటల పెంపు తీర్మానంపై ధర్నా




ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్రం తీసుకు వచ్చిన లేబర్ కోడ్స్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, షాపులు, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు రోజుకు 13 గంటలు పనిని పెంచుతూ, మహిళలకు రాత్రి షిఫ్ట్ డ్యూటీలు వేయవచ్చునని తీర్మానం చేయడం తగదన్నారు. తక్షణమే ఆ విధానాన్ని విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటా శ్రీరామ్, జి.వరలక్ష్మి, కె.తేలయ్యాబాబు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు

▶▶ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ డిమాండ్

▶▶ సెలవుల్లో పలు చోట్ల తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపణ




సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ

తుమ్మపాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ డిమాండ్ చేశారు. అనకాపల్లి పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. కానీ పలు పాఠశాలలు యథావిధిగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆయా విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అటువంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఫణేంద్ర, సహాయ కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షుడు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మార్టూరులో స్వచ్ఛతాహి సేవ

▶▶ గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన




గ్రామంలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

తుమ్మపాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరులో మంగళవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాల్సిందిగా కోరారు. ఇళ్ల వద్ద నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్తను పారిశుధ్య సిబ్బంది సేకరించి సంపద కేంద్రానికి తరలిస్తున్నారన్నారు. ఈ కేంద్రాన్ని కూడా చక్కగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో ప్రభావతి

కొత్తూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి పిలుపునిచ్చారు. కొత్తూరు పంచాయతీ కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. పౌష్టికాహారంపై శిశువు ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో గర్భిణులు ఆకు కూరలు, ఐరన్‌తో కూడిన ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. అలాగే, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి అంతా కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పిహెచ్.కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు నర్సింగబిల్లి పీఏసీఎస్‌లో మహాజన సభ

కశింకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నర్సింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం మహాజన సభ జరగనుందని సంఘ కార్యదర్శి ఎన్.అచ్చియ్యనాయుడు తెలిపారు. ఉదయం పది గంటలకు జరగనున్న ఈ సభలో గత ఆర్థిక సంవత్సరంలో ఆడిట్ రిపోర్టు, 2025 ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబరు 23 వరకు చేసిన ఖర్చులను ఆమోదించడం జరుగుతుందన్నారు. అలాగే భవిష్యత్తు చేపట్టాల్సిన అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సంఘ కార్యాలయం ఆవరణలో జరగనున్న ఈ సమావేశానికి సభ్యులంతా విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కశింకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల కారణంగా కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. వై.తుని గ్రామానికి చెందిన పీలా దేవికుమార్ ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన నిమ్మదల మోహనరావు ఇంటి తలుపులు తట్టాడు. తలుపులు తెరవగా దేవికుమార్‌పై మోహనరావు కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమయంలో కుటుంబ సభ్యులు అడ్డుపడడంతో నిందితుడు తప్పించుకొని పరారీ అయ్యాడు. వీరిరువురి మధ్య గతంలో ఉన్న గొడవల కారణంగానే ఈ దాడికి పాల్పడ్డాడని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు.

## తేగాడలో 200 మందికి వైద్య పరీక్షలు



పరిశుభ్రతపై గ్రామస్థులు, వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ

కశింకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తేగాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రెండు వందల మందికి కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ యశోద తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య సూత్రాలు ప్రతి ఒక్కరూ పాటించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'సీడాప్'లో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా ఉన్న రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి (సీడాప్)లో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆర్టీఐ ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సీవీసీ, సీబీఐ, ఏసీబీలకు ఎక్స్ వేదికగా కోరారు. దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. గత నాలుగేళ్లలో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ (పీఐఏ)లకు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లకు పైగా నిధులు మంజూరుకు ఇచ్చిన అనుమతులు, సిఫార్సు లేఖలు, శిక్షణ కార్యక్రమాలపై ఏసీబీ, కేంద్ర విజిలెన్స్ కమిషన్, సీబీఐ స్థాయిలో సమగ్ర విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వృద్ధుడ్ని ఆశ్రమానికి చేర్చిన డీపీవో



తుమ్మపాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి సందీప్ మానవత్వాన్ని చాటుకున్నారు. అనకాపల్లి మండలం రేబాక పై ఓవర్ బ్రిడ్జి కింద కొంతకాలంగా ఉన్న ఓ వృద్ధుడ్ని మంగళవారం గుర్తించారు. అతని పరిస్థితిని తెలుసుకుని జాలినొందారు. అనంతరం అతనికి సపర్యలు చేశారు. చింపిరి జుట్టు, మాసిన గెడ్డాన్ని తొలగింపజేశారు. ఆహారాన్ని అందించి కశింకోటలో ఉన్న వృద్ధాశ్రమానికి తర లించారు.

## లంకెలపాలెం పరిసరాల్లో భారీ వర్షం



లంకెలపాలెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

లంకెలపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా లంకెలపాలెం పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు ఏకధాటిగా పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నాగార్జున

చింతపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని ఈగల్ బృందం ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అనే పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే విలువైన జీవితాలు నాశనమైపోతాయన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ రవాణ, సాగు, సేవించడం చట్టరీత్య నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.గోవిందరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో 'ఆశ్రమ' హెచ్‌ఎం మృతి



రూపవతి (ఫైల్ ఫొటో)

జి.మాడుగుల, సెప్టెంబరు 23 (ఆంధ్రజోతి): మండలంలోని నుర్మతి బాలిక ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రూపవతి మృతి చెందారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆ మెకు విశాఖపట్నంలో ఓ ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తున్నారు. వైద్య సేవలు పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు సంతాపం తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



తాటిమానుపాలెంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొయ్యూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని బీజేపీ మండల అధ్యక్షుడు సంపరి శివ కుమార్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం అంతాడ పంచాయతీ తాటిమానుపాలెం, బంగారమ్మపేట పంచాయతీ గుమ్మకృపాలెం, గ్రామాలలో పార్టీ ప్రధాన కార్యదర్శి సన్యాసిరావుతో పాటు గ్రామస్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, ఆర్ఎస్ఎస్ సభ్యులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్ షాపుల్లో చోరీ

సీలేరు, సెప్టెంబరు 23, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండలో సోమవారం రాత్రి రెండు దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి. ఈ పంచాయతీ దబ్బకోట మాయాబజార్ కూడలి వద్ద కాళిదాసు మెకానిక్ షాపులో దొంగలు ప్రవేశించి విలువైన వస్తువులను అపహరించారు. సీసీ కెమెరాలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. ధారకొండలో మెయిన్ రోడ్డులో ఉన్న కృష్ణ బైక్ మెకానిక్ దుకాణం షట్టర్లు పగులకొట్టి దొంగ లోపలికి ప్రవేశించారు. అయితే శబ్దం విన్న పక్కనే ఉన్న బైక్ మెకానిక్ లేచి కేకలు వేయడంతో దొంగ పారిపోయాడు. స్థానిక ఎస్ఐ రవీంద్ర వద్ద ప్రస్తావించగా, ఈ చోరీలపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## 26న మండల సమావేశం

చింతపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మండల ఈనెల 26న మండల నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన ఈ జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలన్నారు.



పాడేరులో సర్వేశ్వరరావు, సోమ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కూటమి నేతలు



జీసీసీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరం

# సర్వేశ్వరరావు స్ఫూర్తితో అభివృద్ధికి కృషి

- టీడీపీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్
- సర్వేశ్వరరావు ఏడో వర్ధంతి సందర్భంగా నివాళి

పాడేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు స్ఫూర్తితో గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తనయుడు, తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. కిడారి సర్వేశ్వరరావు ఏడో వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కిడారి ఘాట్‌లో కుటుంబ సభ్యులు, కూటమి శ్రేణులతో కలిసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. సర్వేశ్వరరావు మన్యంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, గిరిజనుల సంక్షేమానికి అందించిన సేవల స్ఫూర్తితో అడుగు వేస్తామన్నారు. అలాగే, ఆయన గిరిజనాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. తన తుది శ్వాస వరకు తండ్రి ఆశయాల కోసం శ్రమిస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు దివంగత నేతలు కిడారి సర్వేశ్వరరావు, సియ్యారి సోమ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీసీసీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో కేఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బాకూరు వెంకటరమణరాజు, పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, కొమ్మా రమాదేవి, సత్యనారాయణ, బొడ్డా శ్యామ్, సోమెలి చిట్టిబాబు, బొర్రా విజయరాణి, పాంగి రాజారావు, పెనుమాక రవికుమార్, వేమనబాబు, ఏజెన్సీలోని అన్ని మండలాలకు చెందిన టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### సివేరి సోమకు ఘన నివాళి

అరకులోయ: దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ 7వ వర్ధంతి మంగళవారం అరకులోయలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సమీపంలో సోమ ఘాట్‌వద్దకు చేరుకుని ఘనంగా నివాళులర్పించారు. సివేరి సోమను, అరకు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా ఉన్న కిడారి సర్వేశ్వరరావును మావోయిస్టులు డుంబ్రిగుడ మండలంలో లివిటిపుట్‌లో హతమార్చారు.ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ తన తండ్రి లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాం, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కొట్యాడ అప్పారావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టీడీపీ నేత వంతల నాగేశ్వరరావు, జీసీసీ మాజీ చైర్మన్, టీడీపీ నేత శెట్టి లక్ష్మణుడు, సోమ సతీమణి ఇచ్చావతి, తన కుమారుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అరకులోయలో సోమఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నేతలు

**డుంబ్రిగుడ:** మాజీ ఎమ్మెల్యేలు కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమల నేతల వర్ధంతి సందర్భంగా వారు తుది శ్వాస విడిచిన లివిటిపుట్టు గ్రామ సమీపంలోని ప్రదేశం వద్ద ఘన నివాళులర్పించారు. గిరిజనాభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగ స్వామి, పెదబయలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ నరంజి ప్రసాద్, వైస్ సర్పంచ్ మధు, నాయకులు లైకోన్, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వ్యాఖ్యలపై సచివాలయ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన సచివాలయ ఉద్యోగులు

పాడేరురూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యో తి): గ్రామ వార్డు సచివాలయ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ నా యకుడు లకే నానిపాత్రుడు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులపై మంత్రి వ్యాఖ్యలు బాధాకరమన్నారు. గత ఆరేళ్లుగా గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను, ప్రజలకు సేవలను అందిస్తున్న ఉ ద్యోగుల సమస్యలను పరిష్కరించకపోగా తిరిగి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమేరకు సబబు అని ప్రశ్నించారు. మంత్రి వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ వార్డు సచివాలయ మండల జేఏసీ నూతన కమిటీని ఎన్ను కున్నారు. మండల అధ్యక్షుడిగా సీహెచ్.అనిల్, కార్యదర్శిగా కె. లక్ష్మీనాయుడు, కోశాధికారిగా పి.నాగేంద్ర ఎన్నికయ్యారు. రాష్ట్ర జేఏసీ సభ్యుడు పి.సింహాచలం, సభ్యులు పాల్గొన్నారు.

## నానో యూరియా వినియోగించాలి: ఏవో

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నానో యూరియాను వినియోగించాలని స్థానిక వ్యవసాయ అధికారి డి. గిరిబాబు అన్నారు. మంగళవారం కొట్నాపల్లి, సంకాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో రైతులు నానో యూరియా, జీవ ఎరువులైన ఫాస్పరస్, సొల్యూబలైజింగ్ బాక్టీరియా, పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వాడాలన్నారు. వరిలో ఆకుముడత తెగులు పలు గ్రామాల్లో కనిపిస్తోందని, దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ పౌడర్ పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు

అనంతగిరి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోకూరు గ్రామంలో అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జాహ్నవి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 93 మంది మహిళలు, పురుషులకు వైద్య పరీక్షలను మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కిల్లో మోస్య, ఎంపీహెచ్ఈవో సింహాచలం, ఎంఎల్‌హెచ్‌పీ హరిక, ఏఎన్ఎం సంధ్య, హెల్త్ అసిస్టెంట్ రాము, పాల్గొన్నారు.



సావ్వలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సత్యశ్రీ

**డుంబ్రిగూడ:** సొవ్వ పంచాయతీలో డాక్టర్ కుమార్ రత్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియా న్ వైద్య సేవలం దించారు. సిబ్బంది సంజీవ రావు, పుష్ప, ప్రభాకర్, అప్పలరాజు పాల్గొన్నారు.

**పెదబయలు:** అరడకోట సచివాలయ పరిధి జీటీడబ్ల్యూ బాలుర పాఠశాల ఆవరణలో వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి పి. సత్యశ్రీ తెలిపారు. వైస్ ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్ మత్స్యరాజు, వార్డు మెంబర్ బాలు, వైద్య సిబ్బంది బింగురాజు, సింహాచలం, లోవకుమారి, భవాని, రాజామణి, హరికృష్ణ, రమ్య, గీత, మూర్తి, మోహన్ పాల్గొన్నారు.



టోకూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి జాహ్నవి

# హత్య కేసులో నిందితుడి ఇల్లు ధ్వంసం

- మృతుని బంధువులు, గ్రామస్థుల ఆగ్రహం
- చింతపల్లి క్యాంప్‌లో భయం.. భయం

సీలేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో పాతకక్షల నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి చింతపల్లిక్యాంప్‌కు చెందిన వంతల భగత్‌రామ్ (32) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై గ్రామస్థులు, మృతుని బంధువుల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఈ కేసులో నిందితుడి ఇంటిని ధ్వంసం చేశారు. దీంతో చింతపల్లిక్యాంప్‌లో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత మూడు నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన గెన్ను అనే వ్యక్తి మద్యం మత్తులో తన సొంత బావమరుదులు ఇద్దరిని బల్లెంతో పొడిచి హత్య చేసిన ఘటన మరువక ముందే, మరో హత్య జరగడంతో గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారు. కక్షలు, వివాదాలతోపాటు గంజాయి మత్తు తదితర అంశాలతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నా రు. ఆదివారం రాత్రి జరిగిన భరత్‌రామ్ హత్య కేసులో నిందితుడి ఇంటిని ధ్వంసం చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న సీఐ వరప్రసాద్, ఎస్ఐ రవీంద్ర చింతపల్లి క్యాంప్‌నకు వెళ్లారు. ఇలా దాడికి పాల్పడడం చట్టరీత్యా నేరమని గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హత్యకు పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకుని శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ధ్వంసం చేసిన నిందితుడి ఇల్లు

## గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు : సీఐ



యువతతో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

సీలేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జీకేవీధి సీఐ వరప్రసాద్ కోరారు. సీలేరుకు చెందిన కొంత మంది యువతను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు వారిలో పరివర్తన రావాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. వీరి వలన గ్రామంలో నేర నియంత్రణ అదుపుతప్పుతుందన్నారు. గ్రామంలో హత్యలు, దొంగతనాలకు పాల్పడుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వా హనాలు వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర పాల్గొన్నారు.

## కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పాడేరురూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థినులు ఆత్మరక్షణకు అందిస్తున్న కరాటే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ట్రైబల్ హెల్త్ అండ్ వెల్ఫేర్ వలంటరీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ వి.పూర్ణచంద్ర నాయుడు కోరారు. స్థానిక ఏపీఆర్ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ ధనలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అ వగాహన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మన్యంలో మహిళలు, బాలికలకు పాండు కరాటే అకాడమి ఇంటర్నేషనల్ కోఫూకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇనస్ట్రక్టర్ బాకూరు పాండురాజు ఆధ్వర్యంలో సెల్ఫ్‌డిఫెన్స్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. వసతిగృహాల్లో ఉంటున్న బాలికలకు ఉచితంగా ఈ శిక్షణను అందిస్తున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా కరాటే క్లబ్ చీఫ్ ఇనస్ట్రక్టర్ పాం డురాజును కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కరాటే ఇనస్ట్రక్టర్లు, పీడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 420 మందికి వైద్య పరీక్షలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, డీసీహెచ్ఎస్ నీలవేణి

చింతపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల్లో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్), మెడికల్ సూపరింటెండెంట్ ఎం. నీలవేణి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రివైద్యులు మంగళవారం ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ప్రారంభించారు ప్రత్యేక వైద్యనిపుణులు డాక్టర్ సబ్బవరపు వాసవి, డాక్టర్ వాక రమేశ్, డాక్టర్ ఒంద్రు శ్రీలత, డాక్టర్ లాలం చందన, డాక్టర్ కె.సాహితి, డాక్టర్ బి.లావణ్య, డాక్టర్ గంటా ప్రభావతి, డాక్టర్ డి. అనుష, డాక్టర్ చంద్రశేఖరరావు, ఫిజియోథెరపిస్టు కె. సరోజిని 420 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జల్లి హలియారాణి, దేవుడమ్మ, ఈశ్వరరావు, టీడీపీ నేత రీమల ఆనందరావు పాల్గొన్నారు.

## జానపద కళల అకాడమీ చైర్మన్‌కు అభినందన



గంగులయ్యను అభినందిస్తున్న జీకేవీధి, చింతపల్లి జనసేన నాయకులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందని జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్ అన్నారు. మంగళవారం విజయవాడలో రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వంపూరి గంగులయ్యను చింతపల్లి, జీకేవీధి జనసేన నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్ల వీరేంద్ర కుమార్, గబులంగి గణేశ్, రఘువంశి, గాజుల శ్రీను, పొటుకూరి జయరాజ్, పాంగి శ్రీను, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

**అరకులోయ:** విజయవాడలో జరిగిన ఏపీ రాష్ట్ర జానపద కళల, సృజనాత్మకత అకాడమీ చైర్మన్‌గా డా.వంపూరు గంగులయ్య ప్రమాణస్వీకారోత్సవానికి అరకు అసెంబ్లీ నియోజకవర్గ జనసేన నాయకులు, పెదలబుడు మాజీ సర్పంచ్‌లు సమర్థి రఘునాథ్, సమర్థి హాజరయ్యారు. ఆయనను అభినందించారు.

## పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ జయరాజ్



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీడీ జయరాజ్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 23, (ఆంధ్రజ్యోతి): పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధవహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలో గల కుంబిరిపడ, కులబీరు, అంటబొంగు, రావిడిపుట్టు తదితర గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రక్రియను ఆయన పరిశీలించారు. గిరిజన రైతులకు పశువులు, మేకలు, గొర్రెలు సంరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కిలగాడ పశు వైద్యాధికారి మోక్షరెడ్డి, సిబ్బంది వరలక్ష్మి, అప్పారావు, వాసుదేవయ్య, పరుశురాం, రాంనాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

- గాయత్రీదేవి అవతారంలో దుర్గాదేవి దర్శనం

పాడేరురూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు మంగళవారం కనకదుర్గమ్మ ఆ లయం, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రాజరాజేశ్వరి దేవి, పూర్ణపుష్కల అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మహాలక్ష్మి దేవీలు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఉదయం 5 గంటల నుంచి భక్తులు వందలాది మంది ఆలయాలకు తరలివచ్చారు. అ మ్మవారికి పూజలను చేపట్టారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, ఆధ్యాత్మిక సేవా బృం ద సభ్యులు చీపురు రమాదేవి, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, కొట్టగుల్లి రామారావు, వి.రాజబాబు, ఎస్.శ్రీనివాస్ కుమార్, ఎస్. కొండలరావు తదితరులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



గాయత్రీ దేవి అవతారంలో కనకదుర్గమ్మ



గాయత్రీ దేవిగా రాజరాజేశ్వరి దేవి

### మోదకొండమ్మను దర్శించుకున్న భవానీ భక్తులు



మోదకొండమ్మ ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భవానీ మాలధారులు

పాడేరురూరల్: మన్యం, మైదాన ప్రాంతాలకు చెందిన వందలాది మంది భవానీ మాలధారులు మంగళవారం మోదకొండమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. భవానీ మాలధారులు సుమారు 500 మందికి ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు.

### ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

పాడేరురూరల్: పూర్ణపుష్కల అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి,మహాలక్ష్మి దేవి అమ్మవారికి వాసవీక్లబ్ మహిళా ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా అ భిషేకాలు, పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పా ల్గొ న్నా రు. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు పర్యవేక్షణలో ప్రతినిధులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

# హైడ్రో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా 27న 'అరణ్య గర్జన'

అరకులోయ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని హైడ్రోపవర్‌ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ బస్కీ ప్రాంత కన్వీనర్ బురిడి దశరథ్ తెలిపారు. ఈ నెల 27న హుక్కుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో అరణ్యగర్జన సభ నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక గిరిజన్ భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టు బాధిత గ్రామాల ప్రజలు అరణ్యగర్జన సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి బుజ్జిబాబు, నాయకులు ము కుంద్, సహదేవ్, కిల్లో జగన్నాథం, కాఫీ రైతు సంఘం మండల కార్యదర్శి గురుమూర్తి, పాయి నానిబాబు, జోషి, రామారావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

**అనంతగిరి:** హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మండలంలోని వేంగడ పంచాయతీ కేంద్రంలో గద్యవలస, వేంగడ, కొత్తవలస గ్రామాల గిరిజనులు మంగళవారం నిరసన తెలిపారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేట్ కంపెనీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ సర్పంచ్, పోరాట కమిటీ కన్వీనర్ సివేరి కొండలరావు, నేతలు మజ్జి సురేశ్, లచ్చన్న, బుట్టన్న, అప్పన్న, రామన్న, రామరాజు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

**చింతపల్లి:** ఆదివాసీల సంపదను దోచుకునే హక్కు ప్రభుత్వాలకు ఎవరిచ్చారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనరస ప్రశ్నించారు. మంగళవారం హైడ్రో పవర్ పంప్డ్ స్టోరేజీకి వ్యతిరేకంగా సమగిరిలో అరణ్య గర్జనయాత్రలో భాగంగా సీపీఎం నేతలు గిరిజనులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడారు.గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, నాయకులు సింహాద్రి, వరహాలుబాబు, ఎంపీటీసీ మోహనరావు, మాజీ సర్పంచ్ బెన్నాస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్యనారాయణ, పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గిరిజన సంఘం ప్రధానకార్యదర్శి బాలదేవ్, తదితరులు

**డుంబ్రిగూడ:** హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఇచ్చి జీవో రద్దు చేయాలని గసభ పంచాయతీ సర్పంచ్ పాంగి సునీత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు.జిల్లాలో హైడ్రో పవర్ ప్రా జెక్టుల నిర్మాణానికి ఒప్పందాలు చేసుకోవడం దారుణమని అన్నారు. గసభ మాజీ సర్పంచ్ సురేశ్ కుమార్, వార్డు సభ్యులు సత్యనారాయణ, రాజ్‌కుమార్, మోహన్‌దాస్ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 23, (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో సైతం విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ట్రాన్స్‌కో డీఈ వేణుగోపాల్ అన్నారు. స్థానిక సబ్ స్టేషన్‌లో మాకవరం ఫీడర్‌కు చెందిన కొత్త బ్రేకర్లను మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పనులను డీఈ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ మురళీమోహన్, ఏఈ సురేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట

▸▸ మాకవరపాలెంలో జేసీబీ సాయంతో చదును ▸▸ రెవెన్యూ అధికారులకు సమాచారం ▸▸ సిబ్బంది హెచ్చరికతో పనులు నిలిపివేత

మాకవరపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మాకవరపాలెంలో చెరువును ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నించగా, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. గ్రామానికి అనుకుని 171 సర్వే నంబరులో సుమారు ఎనిమిది ఎకరాల చెరువు స్థలం ఉంది. ప్రసుత్తం ఇక్కడ సెంటు ఐదు లక్షల నుంచి ఎనిమిది లక్షల రూపాయల వరకు ధర పలుకుతోంది. దీంతో కొందరి కళ్లు చెరువుపై పడింది. ఇందులో భాగంగా మంగళవారం జేసీబీ సాయంతో చదును చేసి, ఆక్రమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇది గుర్తించిన స్థానికులు కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు వీఆర్వో సూరిబాబు అక్కడకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. పనులు నిలిపివేయాలన్నారు. ఇదంతా చెరువు స్థలమని, ఆక్రమణ చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. చేసేది లేక అక్కడి నుంచి వారు పనులు నిలిపివేసి వెనుదిరిగారు.



చెరువు స్థలం ఆక్రమణకు జేసీబీతో చదును చేయిస్తున్న దృశ్యం

## జి.కోడూరు క్వారీ నిరసన కారుల అరెస్టు



నిరసన కారులను వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

నర్సీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ లీజు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 63 రోజులుగా నిరసన దీక్ష చేపడుతున్న గ్రామస్థులను పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ గోవిందరావు, ఎస్‌ఐలు ఉమామహేశ్వరరావు, రమేశ్ , పోలీస్ సిబ్బంది నిరసనకారులు వద్దకు వచ్చారు. శిబిరానికి పోలీసుల అనుమతి లేదని తెలిపారు. మైక్ వాడడానికి డీఎస్పీ అనుమతి ఉండాలని సీఐ గోవందరావు చెప్పారు. ఏమైనా ఉంటే మైనింగ్ కార్యాలయం వద్ద తేల్చుకోవాలన్నారు. అనంతరం సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి, బీఎస్పీ నాయకుడు బొట్టా నాగరాజులను వ్యాన్‌లో ఎక్కించుకొని స్టేషన్‌కు తరలించారు.

## పని గంటల పెంపు తీర్మానంపై ఆందోళన




ఎన్టీఆర్ స్టేడియంలో గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ నాయకుల నినాదాలు

నర్సీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పని గంటల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేయడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, వివిధ పథకాలలో పని చేస్తున్న స్కీమ్ వర్కర్లు, ప్రైవేటు విద్యా సంస్థలు, పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులు ఇప్పటికే పనిభారంతో సతమతం అవుతున్నారన్నారు. అయినప్పటికీ వీరి కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదన్నారు. ఇటువంటి తరుణంలో వీరికి బాసటగా నిలవాల్సిన ప్రభుత్వం పని గంటలు పెంచేలా అసెంబ్లీలో తీర్మానం చేయడం తగదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, వేతనాల పెంపు దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి డి.మహాలక్ష్మి, ఆశ మండల నాయకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాలి



అల్లూరి, గంటందొర సమాధుల వద్ద సీపీఎం శ్రేణుల నివాళి

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని ఈ నెల 22 నుంచి 27 వరకు చేపడుతున్న ఆదివాసీ అరణ్య గర్జన జీపు యాత్ర మంగళవారం కృష్ణాదేవిపేట చేరుకుంది. ఈ సందర్భంగా అప్పలనర్స అల్లూరి పార్కులో పార్టీ నాయకులతో కలిసి అల్లూరి, గంటందొర సమాధుల వద్ద నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హైడ్రోపవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయకపోతే అల్లూరి స్ఫూర్తిగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎర్రకొండ, పెదకోట తదితర ఐదు ప్రతిపాదిత హైడ్రోపవర్ ప్రాజెక్టుల కోసం సుమారు 10వేల ఎకరాల భూమిసేకరణ జరుగుతుందని ఆరోపించారు. వీటి వల్ల వేలాది ఆది వాసీ కుటుంబాలు తమ సాంప్రదాయ భూములను కోల్పోతారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు వెంటనే ప్రాజెక్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొర్ర త్రినాథ్, కమిటీ సభ్యులు బుజ్జిబాబు, బాబూరావు పాల్గొన్నారు.

## చోద్యంలో ఘనంగా కోటకొండమ్మ పండుగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో మంగళవారం కోటకొండమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఏఎల్‌పురం, లింగంపేట, గైరంపేట, పాతకృష్ణదేవిపేట తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తలనీలాలను సమర్పించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఘటాలను ఊరేగించారు. సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతం కావాలి'



జనసేన నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

గొలుగొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఇప్పటి నుంచే జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. గొలుగొండలో మంగళవారం ఏర్పాటైన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై సర్పంచులకు శిక్షణ

గొలుగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై రెండు రోజుల పాటు సర్పంచులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో బాబూరావు తెలిపారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధ, గురువారాల్లో జరగనున్న ఈ శిబిరంలో సర్పంచులకు గ్రామాలు ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న అంశాలను వివరించడం జరుగుతుందన్నారు. సర్పంచులు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## 'వీఆర్‌వో పై చర్యలకు కలెక్టర్‌కు నివేదన'

మాకవరపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండల అగ్రహారంలో పనిచేస్తున్న వీఆర్‌వో భూ రీసర్వేలో అవకతవకలకు పాల్పడినట్టు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్టు తహశీల్దార్ జి.వెంకటరమణ తెలిపారు. సదరు ఉద్యోగిపై రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో కొండలఅగ్రహారం నుంచి జెడ్.గంగవరం పంచాయతీకి బదిలీ చేశామన్నారు. అయినప్పటికీ వెళ్లకుండా అక్కడే నెలరోజులుగా విధులు నిర్వహించడంతో చివరకు చేసేది లేక కలెక్టర్‌కు నివేదిక అందజేశామన్నారు. అనంతరం కొండల అగ్రహారానికి కొత్తగా మరొక వీఆర్‌వోను బదిలీ చేశామన్నారు.

## జీఎస్‌టీ తగ్గింపుపై కూటమి నేతలు సంబరాలు



మోదీ, నిర్మల సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

రావికమతం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చిన సందర్భంగా కూటమి నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జీఎస్టీ తగ్గించి పండగ కానుకగా అందించిన ప్రధాని, ఆర్థిక మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరరావు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరావు, బీజేపీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న, రావికమతం ఉపసర్పంచ్ గంజి మోదునాయుడు, గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులలో వర్షం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎండకాసింది. అనంతరం వాతావరణంలో మార్పులు వచ్చి గంటసేపు వర్షం కురిసింది.

## బంగారుతల్లి కుటుంబాలను గుర్తించండి : ఎంపీడీఓ

దేవరాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో 20 బంగారుతల్లి కుటుంబాలను ఈనెలాఖరులోగా ఎంపిక చేయాలని ఎంపీడీఓ సువర్ణరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పీ4పై జరిగిన శిక్షణ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి మౌలిక సౌకర్యాలు లేని వారిని గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి ఏమి కల్పించామో యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. బంగారుతల్లి పథకంలో ప్రతి గ్రామం నుంచి 20 కుటుంబాలను గుర్తించాలన్నారు. మండల పరిపాలనా అధికారి లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాలలో ఎంపీడీఓ పర్యటన

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మంగళవారం ఎంపీడీఓ శివప్రసాద్ నారాయణ దిబ్బిడి చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకొన్నారు. చెత్త సంపద కేంద్రాన్ని వినియోగించుకొని పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమమలో సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోన్నాబత్తుల శ్రీనివాసరావు. కార్యదర్శి రమణమ్మతదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుపై రాష్ట్ర స్థాయి అధికారుల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి అధికారులు

చీడికాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో అమలు చేస్తున్న ప్రకృతి సాగుపై రాష్ట్రస్థాయి అధికారులు నీరజ, రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ కృష్ణారావు, బీపీఎం సీహెచ్.లచ్చన్న పరిశీలించారు. మంగళవారం చెట్టుపల్లితో పాటు పలు గ్రామాల్లో సాగుచేస్తున్న రైతుల పొలాలకు వెళ్లి సాగుపై రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బీఎన్ రోడ్డుపై ప్రభుత్వం నిర్లక్ష్యం : సుబ్బన్న

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత ప్రధానమైన బీఎన్ రోడ్డు పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న విమర్శించారు. మంగళవారం వడ్డాదిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాలుగు జిల్లాలకు ప్రధాన రహదారి అయిన బీఎన్ రోడ్డు పట్ల కూటమి నేతలకు ఇంత నిర్లక్ష్యం తగదన్నారు. విజయరాయరాజు పేట తాచేరు కాజ్‌వే కొట్టుకుపోయి 40 రోజులు కావస్తున్న ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల దృష్టికి తీసుకు వెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. తక్షణమే కాజ్‌వేని పునరుద్ధరించాలని లేకుంటే కాంగ్రెస్ తరుపున ఆందోళన చేస్తామని మీసాల సుబ్బన్న హెచ్చరించారు.

## శతశాతం ఫలితాలు సాధించాలి : డీఐఈఓ

కె.కోటపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేలా బోధన ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) మద్దిలి వినోద్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, అయ్యన్న జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఐటీ, నీట్, ఎంసెట్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా ఉత్తమ బోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. పరీక్షల నేపథ్యంలో ప్రాక్టికల్ లాబ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు విధిగా వారాంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని వినోద్‌బాబు అన్నారు. ఆయనతోపాటు ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ నాగమణి, అయ్యన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ ఉన్నారు.

## జీఎస్‌టీ తగ్గింపుతో దేశంలో నూతన శకం

▸▸ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

చోడవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపుతో దేశంలో నూతన శకం ప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాంది పలికారని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ కొనియాడారు. దేశంలో జీఎస్‌టీ రేట్లు తగ్గింపు సందర్భంగా మంగళవారం స్థానిక కొత్తూరు జంక్షన్‌లో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి పీఎం మోదీ చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందర్ప రమణమూర్తి. టీడీపీ నాయకులు మల్లునాయుడు, పెదబాబు, మజ్జి గౌరీశంకర్, సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, ఎర్రంశెట్టి చిన్న, నేమాల హరి, పప్పు శ్రీను, దివ్య, రూపాదేవి, జోగినాయుడు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ముందస్తు పరీక్షలు

చోడవరం,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలలో అసంక్రమిత వ్యాధులైన నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లతో పాటు బీపీ, షుగర్ వ్యాధులకు నిర్వహించే ముందస్తు పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ దినేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం గవరవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చోడవరం 3 సచివాలయం పరిధిలో మహిళలకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు పరీక్షలు నిర్వహించడంతో పాటు తల్లీబిడ్డలకు సేవా కార్యక్రమాలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లునాయుడు, సకురు కోటేశ్వరరావు, గూనూరు సురేష్‌లతో పాటు, ఆయుర్వేద డాక్టరు పద్మ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యండపల్లిపాలెంలో గాలికుంటు నివారణ టీకాలు

దేవరాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యండపల్లిపాలెం, ముషిడిపల్లి, ఎం.అలమండ గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను కె.కోటపాడు పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు ఈ.దినేశ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎం.అలమండ ఉపకేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. అలాగే టీకాల కార్యక్రమం ఏమేరకు జరుగుతుందో తనిఖీ చేశారు. పశు వైద్యాధికారులు మంజుషారాణి, త్రినాథ్ పాల్గొన్నారు.

### చీడికాడలో..

మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని పశుసంవర్థక శాఖ ఏడీ చిట్టినాయుడు సిబ్బందికి ఆదేశించారు. మండలంలో అర్జునగిరిలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం పెదగోగాడ పశువైద్య కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, టీకాలు వేయించకపోతే పశువులకు జరిగే నష్టాల గురించి రైతులకు వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, గంగునాయుడు పాల్గొన్నారు.

## నేడు తునివలసలో ఉచిత వైద్య శిబిరం

చీడికాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీన తునివలస గ్రామంలో ఉచిత కంటి దంతవైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని బీజేపీ మండల అధ్యక్షులు పాతాళం బాలకృష్ణ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. రోగులు ఆధార్‌కార్డుతో రావాలని ఆయన కోరారు.



## గాయత్రీదేవి అవతారంలో దుర్గామాత

చోడవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయదశమి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో ఉన్న దుర్గామాత ఆలయంలో మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రీదేవి అవతారంలో ఉన్న దుర్గామాతను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

## గాయత్రీ దేవిగా దుర్గమ్మ



రావికమతం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో రెండో రోజు మంగళవారం గాజుల అలంకరణతో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వేపా రామకృష్ణ కిషోర్ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

## గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోండి

**అసెంబ్లీలో ప్రభుత్వానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విజ్ఞప్తి**

చోడవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార రంగంలో మిగిలిన ఏకైక చక్కెర కర్మాగారం గోవాడను ఆదుకోవాలని ప్రభుత్వానికి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీలో కొణతాల రామకృష్ణ మాట్లాడిన వ్యవసాయంలో నూతన సాగు విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వం, చెరకు సాగుకు అవసరమైన సాంకేతిక ప్రోత్సాహం అందించి రైతులను ఆదుకోవడానికి చర్యలు చేపట్టాలని కోరారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవడంతో పాటు రైతులకు రూ.30 కోట్లు బకాయిలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కొణతాల కోరారు.

**జనసేన ఇన్‌చార్జి హర్షం**

అసెంబ్లీలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితిపై కొణతాల రామకృష్ణ మాట్లాడి గోవాడ ఫ్యాక్టరీ పరిస్థితి, చెరకు రైతుల బకాయిలు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడంపై నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు హర్షం వ్యక్తం చేశారు. గోవాడ సమస్యలపై మాట్లాడిన అనకాపల్లి ఎమ్మెల్యేకు గోవాడ చెరకు రైతులు, కార్మికుల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అంబరాన్ని తాకిన భవానీ అంబలం పూజ



గుమ్మాళ్లపాడులో అంబలం పూజకు తరలివచ్చిన భవాని భక్తులు (ఇన్‌సెట్‌లో) దుర్గాదేవికి ఏర్పాటు చేసిన అంబలం

రావికమతం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మాళ్లపాడులో సోమ, మంగళవారాల్లో చేసిన దుర్గాదేవి అంబలం పూజ అంబరాన్ని తాకింది. ఈసందర్భంగా అంకుపాలెంకు చెందిన వేద పండితులు, గురుభవానీ యానామాంద్రా వెంకరమణమూర్తి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ అంబలం పూజకు రావికమతం, రోలుగుంట, చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాల నుంచి భవానీలు వేల సంఖ్యలో హాజరయ్యారు. భవానీ భక్తులతోపాటు ఇంటింట మహిళలు, భక్తులు భాగస్వాములై ఈ పూజా కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. మాలధారణ చేసిన భవానీ భక్తులు జై దుర్గా భవానీ నామస్మరణతో గ్రామంతా మారుమోగాయి. భజన కార్యక్రమం అనంతరం భవానీ భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశారు.

## అంధకారంలో దేవరాపల్లి మండలం

**మధ్యాహ్నం సరఫరా పోయి రాత్రి వరకు రాని విద్యుత్**

దేవరాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో వర్షం పడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయి రాత్రి అయినా పునరుద్ధరించలేదు. విద్యుత్ పరమైన ఏ సమస్య అయినా ఏఈఈ తప్ప మిగతా సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రానికి 24 గంటలు ఇవ్వాలన్న నిబంధన గాలిలో కలిసిపోయింది. 24 గంటల సరఫరా ఇవ్వడం కోసం ప్రతి శుక్రవారం ఏదో ఒక గ్రామాలకు సరఫరా నిలుపుదల చేస్తుంటారు. అయినప్పటికీ మంగళవారం మండల కేంద్రం మధ్యాహ్నం నిలిచిన విద్యుత్ సరఫరా రాత్రి అయినా ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

## పిడుగు పడి పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదె

కె.కోటపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌వై అగ్రహారం గ్రామంలో మంగళవారం పిడుగు పడి పాడి గేదె మృతి చెందింది. మధ్యాహ్నం ఒంటిగంటన్నర ప్రాంతంలో పిడుగు పడడంతో మండలంలోని ఆర్‌వై అగ్రహారం ఎంపీటీసీ సభ్యుడు యడ్ల పైడినాయుడుకు చెందిన గేదె మృతి చెందింది. పాడి గేదె విలువ రూ.70వేలు ఉంటుందని రైతులు తెలిపారు. పశువైద్యులు వీఆర్వో సమక్షంలో పంచనామా నిర్వహించారు.

## నేడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాదిరాయి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం పది నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. కింతలి సబ్ స్టేషన్‌కి కొత్త లైన్ వేయడంతో పాటు మరమ్మతు పనులు చేపట్టనుండడంతో గాదిరాయి, ఒమ్మిలి, వీజే.పురం, సత్యవరం, డి.గొటివాడ, కొత్తవలస, వెలంపాడు, జేడీపేట, కింతలి, కింతలి వల్లాపురం, ఎం.కృష్ణాపురం, పొంగలిపాక, జాలంపల్లి, పొన్నవోలు, అవురువాడ గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## 'దోమతెరలతో ప్రాణాంతక వ్యాధులు దూరం'

చీడికాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా అందించిన దోమతెరలను వినియోగిస్తే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి సూచించారు. మండలంలో శిరిజాంలో 794 కుటుంబాలకు ఇచ్చిన దోమతెరలను మంగళవారం ఆమె ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. వినియోగంపై పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో పట్నాల గోపి, పంచాయతీ కార్యదర్శి ఎ.కృష్ణవేణి, గ్రీన్ గార్డు రమణ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ సరకులను పూర్తిస్థాయిలో అందించాలని వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గొర్లివాని పాలెం పంచాయతీ పరిధిలో గల టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న వారికి పూర్తిస్థాయిలో రేషన్ సరకులు అందేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె స్థానిక మహిళలతో కలిసి తహశీల్దార్ బి.నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. రేషన్ సరుకులు పూర్తిగా సరఫరా లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీవాసులంతా తక్షణమే మ్యాపింగ్ చేయించుకోవాలని తహశీల్దార్ వారికి సూచించారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులందరికీ రేషన్ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు బంగారమ్మ, మాణిక్యం, సరోజిని, లక్ష్మమ్మ, వరలక్ష్మి, మంగమ్మ, కనకమహాలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఆర్‌సీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజు

పెందుర్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెందుర్తికి చెందిన వాల్మీకి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి చారేంద్ర నాగరాజుకి నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.


పెందుర్తి అయ్యప్ప స్వామి ఆలయంలో బాలత్రిపురసుందరిగా దుర్గాదేవి

# దుర్గాదేవి పాహిమాం..

» పలుచోట్ల వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు

పెందుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తిలోని ఉత్తరాంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గల దుర్గమ్మను బాలత్రిపురసుందరిగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. పలువురు మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో గల పంచముఖ గాయత్రీదేవి ఆలయంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా, సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలోని అమ్మవారిని ధాన్యలక్ష్మిగా, వెంకటాద్రి శిఖరం దిగువన గల మహాకామేశ్వరి ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి పూజాది కార్యక్రమాలను చేపట్టగా, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారకతను దర్శించుకున్నారు. ఎస్‌ఆర్ పురంలోని కనకదుర్గ ఆలయంలోని అమ్మవారిని ధర్మకర్త కాయితి ఎర్రిబాబు ఆధ్వర్యంలో బాలత్రిపురసుందరిగా అలంకరించి పూజలు జరిపారు. అదేవిధంగా చినముషిడివాడ శారదా పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పీఠం అధిష్టాన దేవత శారదా రాజస్వరూప రాజశ్యామల అమ్మవారిని మహేశ్వరిగా అలంకరించి పూజలు చేశారు. చంద్రమౌళీశ్వరులకు పీఠాధిపతి పంచామృతాభిషేకాలు నిర్వహించి నక్షత్ర హారతులిచ్చారు. యాగశాలలో శ్రీచక్రనవావరణార్చన, రాజశ్యామల సహిత చండీయాగాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన, సువాసిని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర పాల్గొన్నారు.

### అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పణ


శారదా పీఠంలో మహేశ్వరిగా పూజలందుకున్న రాజశ్యామల అమ్మవారు

లంకెలపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాలను పెదముషిడివాడలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భవానీ భక్తులు గ్రామంలో ఏర్పాటు చేసిన మండపాల వద్దకు పసుపు, కుంకుమలతో మంగళవారం ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లా నాగమణి, నాయకులు పల్లా అప్పారావు, వై.బుజ్జి, కలవలపల్లి సత్యనారాయణ, బొండా అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.




ఆక్రమణలను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జడ్సీ శంకరరావు

## 90వ వార్డులో జడ్సీ పర్యటన

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం, ఎన్ఎస్ టీఎల్ ఏరియా, వంటిల్లు కూడలి, సుసర్ల కాలనీ వందడుగుల రోడ్డు, విమానగ్‌నగర్, కాకానీనగర్, పరిసర ప్రాంతాల్లో జోన్-8 జడ్సీ హెచ్.శంకర్రావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించిన ప్రదేశాలను పరిశీలించారు.

అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మురుగు కాలువలు, గెడ్డల్లో పూడికలను పూర్తిగా తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు విరివిగా కురుస్తున్నందున కాలువలు, గెడ్డల ద్వారా నీరు సజావుగా ముందుకు సాగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. జడ్సీ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# ఫ్లైయాష్ కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోండి

» సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు వినతి

పరవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన ఫ్లైయాష్ (బూడిద)ను రవాణా చేస్తున్న లారీల కారణంగా కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని, దీని నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మకు లేఖ రాశారు. ఫ్లైయాష్‌ను రవాణా చేసే క్రమంలో లారీల యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదని వివరించారు. బూడిద ఎగరకుండా ఉండేందుకు పైన టార్పాలిన్ కప్పాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఎవరూ చేయడం లేదని తెలిపారు. దీంతో బూడిద ఎగిరి తీవ్రమైన వాయు కాలుష్యానికి కారణమవుతుండడంతో లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, పిట్టవానిపాలెం, దేవాడ, పరవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఫ్లైయాష్‌ను పరిమితికి మించి లారీల ద్వారా రవాణా చేయడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, దీనివల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లైయాష్ వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని విన్నవించారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన కోరారు.



బాలోపాసన పూజల్లో పాల్గొన్న బాలికలు, తదితరులు

## మహాకామేశ్వరి పీఠంలో బాలోత్సవం

పెందుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడి సాధూమఠం సమీపంలో దివంగత పీఠాధిపతి యద్ధనపూడి అయ్యన్న పంతులు నెలకొల్పిన మహాకామేశ్వరి పీఠంలో మంగళవారం బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలకు అమ్మవారి మూలమంత్రంతో మంత్ర ప్రతిష్ఠ చేసి సామూహికంగా బాలోపాసన సరస్వతీ పూజలు చేశారు. బాలికలకు అలంకార వస్తువులు, అమ్మవారి శేషవస్త్రాలను అందజేసి సత్కరించారు. ఉత్తర పీఠాధిపతి శక్తీదేవి వారిని ఆశీర్వదించారు. తొలుత బాలత్రిపురసుందరి అలంకణలో ఉన్న అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

# లంకెలపాలెం పరిసరాల్లో భారీ వర్షం

లంకెలపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలోని లంకెలపాలెంతో పాటు పెద ముషిడివాడ, కన్నూరు, మంత్రిపాలెం, పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. లంకెలపాలెం, ఫార్మాసిటీ రహదారి, ఏలేరు కాలువ బ్రిడ్జి వద్ద రోడ్డుపై పెద్దఎత్తున నీరు ప్రవహించింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని భారీ వర్షం కురవడంతో ఊరట చెందారు.

ఇదిలావుండగా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరంతా పైకి రావడంతో నివాసితులు ఇబ్బందులు పడ్డారు. లంకెలపాలెం నుంచి సబ్బవరం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో నీరు పెద్దఎత్తున నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



లంకెలపాలెంలో కురుస్తున్న వర్షం

## ఆయుర్వేద వైద్యంతో అద్భుత ఫలితాలు

» ప్రభుత్వ ప్రిన్సిపాల్ బి.శంకర్

సబ్బవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.శంకర్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చునని పేర్కొన్నారు. భారత దేశంలో ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేద వైద్య విధానం కొనసాగుతుందన్నారు. ఈ వైద్యం భారతీయ ఆహారపు అలవాట్లతో మిళితమై ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఆయుర్వేదం ఎంతో దోహదపడుతుందని శంకర్ వివరించారు. అందువల్ల అందరూ ఆయుర్వేద వైద్యం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు రజనీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేశ్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎలమంచిలి క్రీడాకారులు ఎంపిక



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన నగిరెడ్డి రోహిత్, ఎం.హర్షిత, గాయత్రి

ఎలమంచిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎలమంచిలికి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్టు కోచ్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 18న గోపాలపట్నంలో జరిగిన అండర్-17 రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో ఎం.హర్షిత, గాయత్రి, 21వ తేదీన పరవాడలో జరిగిన అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో నగిరెడ్డి రోహిత్ ఉత్తమ ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. దీంతో వచ్చే నెలలో కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా తరపున పాల్గొనే జట్లలో వీరికి స్థానం లభించింది.

# విశాఖ-రాయపూర్ హైవే త్వరగా పూర్తిచేయాలి

» ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు కలెక్టర్ సూచన



చిన్నయ్యపాలెం వద్ద ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం- రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని చిన్నయ్యపాలెం వద్ద జరుగుతున్న ఇంటర్ చేంజ్ (అనకాపల్లి- ఆనందపురం, విశాఖ- రాయపూర్ హైవేలు కలిసే చోట) పనులను మంగళవారం ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోశ్‌కుమార్ యాదవ్‌తో కలసి పరిశీలించారు. డీపీఆర్‌లో సూచించిన విధంగా సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ చెప్పారు. గ్రామాల వద్ద ప్రజల రాకపోకలకు, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా అవసరమైనచోట అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించారు. వీరి వెంట ఆర్డీవో షేక్ ఆయిషా, ఎన్‌హెచ్-16 ఎస్‌డీసీ జ్ఞానవేణి, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్‌కుమార్, తదితరులు వున్నారు.

# గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల వితరణ




గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందజేస్తున్న ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు

నర్సీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అవినీతి నిరోధక సంస్థ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయానికి పంపించారు. మంగళవారం పట్టణ ఎస్‌ఐ ఉమామహేశ్వరావు చేతుల మీదుగా ఆ పుస్తకాలను గ్రంథాలయాధికారిణి దమయంతికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కాలం వృథా చేయకుండా పోటీ పరీక్షల పుస్తకాలు ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.

# గంజాయి నియంత్రణకు ఉమ్మడి వ్యూహం

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీఐజీ, ఇతర అధికారులు వివరించారు. ఏజెన్సీలో గంజాయి సాగు గణనీయంగా తగ్గిందన్నారు. అల్లూరి జిల్లాలో 2021-22లో 7,515 ఎకరాల్లో గంజాయి సాగు చేయగా అది 2024-25 నాటికి 93 ఎకరాలకు తగ్గిందన్నారు. రైతులను అక్రమ సాగు నుంచి దూరం చేయడానికి పోలీసులు 10,817.25 ఎకరాల్లో నాటేందుకు వీలుగా 22 రకాల 4.68 మిలియన్ మొక్కలను పంపిణీ చేసినట్టు వివరించారు. 10,308 గ్రామాల్లోని 35,618 మంది రైతులకు 32,760 కిలోల రాజ్‌మా విత్తనాలను అందించామన్నారు. ఈ ఏడాది 35 వేల ఎకరాల్లో 30 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు పేర్కొన్నారు. గత మూడేళ్లకు సంబంధించిన శాంతి, భద్రతల వివరాలను రేంజ్ అధికారులు ఒడిశా పోలీసు అధికా రులతో పంచుకున్నారు.

గంజాయి రవాణాకు సంబంధించి 2023లో 553 కేసులు నమోదు కాగా, 32,261 కిలోలను స్వాధీనం చేసుకుని, 1,764 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు 393 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 2024లో 652 కేసులు నమోదు చేయగా, 35,062 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 19,41 మంది నిందితులను పట్టుకున్నామని, 483 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 377 కేసులను నమోదు చేసి, 22,207 కిలోల గంజాయిని, 244 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, 1,038 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి సహకారం, నిబద్ధతతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసేందుకు ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు నిర్ణయించారు. సమావేశంలో కొరాపుట్ డీఐజీ (సౌత్ వెస్టర్న్ రేంజ్) డాక్టర్ కన్వర్ విశాల్‌సింగ్, రాయగడ ఎస్పీ స్వతి ఎస్ కుమార్, కోరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మ, మల్కన్‌గిరి ఎస్పీ వినోద్ పాటిల్, ఒడిశాలోని వివిధ సబ్ డివిజనల్ పోలీసు అధికారులు, ఏపీ నుంచి విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. డీఐజీ గోపీనాథ్ జట్టి చొరవ, దూరదృష్టిని పలువురు అధికారులు ప్రశంసించారు.

# 'హైడ్రో పవర్'పై అపోహలు

... 5వ పేజీ తరువాయి

ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపే ప్రాజెక్టులుగా వీటికి గుర్తింపు లభించనుంది. ప్రభుత్వం గిరిజనులకు ఎటువంటి నష్టం లేకుండా, వారికి మేలు జరిగే విధంగా ఈ ప్రాజెక్టుల పనులు చేపట్టాలని సూచించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో సదస్సులు నిర్వహించి వారిలో అపోహలు తొలగించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.



# వరిలో ఆకుముడత పురుగు

» పలుచోట్ల పొటాషియం లోపం

» నివారణ చర్యలు చేపట్టాలని ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవాని సూచన

» రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు



ఆకుముడత తెగులు సోకిన వరి పైరు



పొటాషియం లోపంతో పసుపు రంగులోకి మారిన వరి ఆకుల అంచులు

అనకాపల్లిఅగ్రికల్చర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో వరి పైరును ఆకుమడత పురుగు ఆశించిందని, ఇంకా పొటాషియం లోపం గమనించామని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.భవాని తెలిపారు. వరి ఆకుల అంచులు పసుపు రంగులోకి మారితే అది పొటాషియం లోపంగా గుర్తించి ఎకరాకు 20 కిలోల ఎంవోపీ, పది కిలోల యూరియా చల్లాలని సూచించారు. వరి పైరును ఆకుముడత పురుగు ఆశిస్తే.. ఆకుల మధ్యలో పురుగు ఉండి, ఆకుపచ్చని పదార్థాన్ని తినివేయడం వల్ల ఆకులు తెల్లగా మారిపోతాయని, వీటి నివారణ కోసం లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు కలిపి, పొలంలో నీటిని తీసివేసి పిచికారీ చేయాలన్నారు. వరిలో పాముపొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని భవాని తెలిపారు.

## రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి, మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 33.2 నుంచి 33.5 డిగ్రీలు, కనిష్ఠంగా 25 నుంచి 26.6 డిగ్రీలు నమోదు అవుతాయని చెప్పారు. మంగళవారం ఆర్‌ఏఆర్‌ఎస్‌లో జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, ఆర్.సరిత, సిహెచ్.రామలక్ష్మి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్‌తో వేలాది మందికి ఉపాధి

» 'పేటకు దేశ వ్యాప్తంగా గుర్తింపు వస్తుంది

» కూటమి నేతలు వెల్లడి



మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, అనిత, సీఎం రమేశ్ ఫొటోలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వల్ల పాయకరావుపేట నియోజకవర్గానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందని, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని కూటమి నాయకులు చెప్పారు. నక్కపల్లికి స్టీల్‌ప్లాంట్ మంజూరు పట్ల మంగళవారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద వారి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూటమి శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోట నగేశ్, కొప్పిశెట్టి వెంకటేశ్, చించలపు పద్దు, కొప్పిశెట్టి కొండబాబు, అమలకంటి అబద్ధం, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు నూకరాజు, పెద్దిరెడ్డి శ్రీను, దేవర సత్యనారాయణ, కోసూరి శ్రీను, వైబోయిన రమణ, వెలగా శ్రీను, మేరుగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై దృష్టి పెట్టండి

» కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, పక్కన డీఆర్‌డీఏ పీడీ వి.మురళి

పాడేరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పీజీఆర్‌ఎస్‌లో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, వాటిపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ప్రగతిలో నడిపించాలన్నారు. రుణాల రికవరీ పెంచాలని, కొత్త రుణాలను అందించాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో జరిగే పనులపై ఆరా తీశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఉండాలని, వారికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో మొక్కలు నాటే పనుల స్థితిగతులపై ఆరా తీస్తూ, వేగవంతం చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు, భూగర్భ జలాల పెంపు, సాగునీటి వనరుల అభివృద్ధి, పంచాయతీరాజ్, తదితర శాఖల పనులను వేగవంతం చేయాలన్నారు. మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీవోలు వారంతపు సమీక్షలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జేసీడాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు శ్రీపూజ, స్మరణ్‌రాజ్, అపూర్వభరత్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, పీజీఆర్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి ఎంవీఎస్.లోకేశ్వరరావు, డ్వామా పీడీ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

... 5వ పేజీ తరువాయి

వ్యాపారం చేస్తున్నారు. కొబ్బరికాయల తీతకు సంబంధించి ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం మధ్యాహ్నం గోకులపాడు వెళ్లారు. తరువాత తమ్ముడు విశాఖ వెళ్లేందుకు అడ్డరోడ్డు జంక్షన్‌లో దింపిన నాగేశ్వరరావు, తిరిగి ఇంటికి వెళుతున్నాడు. గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న వ్యాన్, బైక్‌ను ఢీకొని రోడ్డు పక్కన గోతిలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నర్సీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన షోరూమ్‌లో వాటర్ సర్వీసింగ్ చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పట్టణంలోని వెంకునాయుడుపేటలో నివాసం వుంటున్న దన్నిన వంశీ పెదబొడ్డేపల్లిలోని సుజుకి బైక్ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం షోరూమ్‌కి వెళ్లాడు. తరువాత ఏం జరిగిందో తెలియదుగానీ.. మధ్యాహ్నం 3.30 గంటలకు అదే షోరూమ్‌లో పని చేస్తున్న ప్రవీణ్, వేణు వెంకునాయుడుపేటలో వంశీ తండ్రి గోవింద్ వద్దకు వచ్చారు. వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి వంశీ కింద పడిపోయాడని, వెంటనే ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకు వెళ్లామని చెప్పారు. దీంతో వంశీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. అప్పటికే వంశీ చనిపోయినట్టు డాక్టర్లు చెప్పారు. చేతికి అందివచ్చిన ఒక్కొగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అయ్యారు. గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాచేరు గెడ్డలో పడి విద్యార్థి గల్లంతు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేట తాచేరు కాజ్‌వే వద్ద వరద ప్రవాహంలో పడి ఎనిమిదో తరగతి విద్యార్థి గల్లంతయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. విజయరామరాజుపేటకు చెందిన ఆడారి గోపి కుమారుడు రోహిత్ (13) స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం నుంచి పాఠశాలకు దసరా సెలవులు ఇవ్వడంతో, మంగళవారం ఉదయం తన తమ్ముడు లోహిత్ కలిసి గ్రామానికి సమీపంలో వున్న తాచేరు కాజ్‌వే వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో చెప్పు జారిపోయి నీటిలో పడడంతో దానిని తీసుకోవడానికి రోహిత్ గెడ్డలోకి దిగాడు. ఈ సమయంలో వరద ప్రవాహం ఉధృతంగా వుండడంతో గల్లంతయ్యాడు. దీంతో భయాందోళన చెందిన లోహిత్ వెంటనే ఇంటికి వెళ్లి అన్న నీటిలో పడి గల్లంతైన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. వారితోపాటు మరికొంతమంది గ్రామస్థులు కాజ్‌వే వద్దకు వచ్చి చూశారు. రోహిత్ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి గత ఈతగాళ్ల సాయంతో తాచేరుతోపాటు పెద్దేరు నదిలో కూడా గాలించారు. సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాలీ.. ఒకరి మృతి

పరవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారాయుడుపేట జంక్షన్‌కు సమీపంలో ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

అచ్యుతాపురం మండలం దొప్పెర్లకు చెందిన కొల్లి బాబురావు (54) ఫార్మాసిటీలో లేబర్ పనులు నిర్వహిస్తున్న ఒక కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని తొమ్మిది గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ధర్మారాయుడుపేట జంక్షన్ సమీపంలోకి వచ్చే సరికి అచ్యుతాపురం వైపు నుంచి వస్తున్న ట్రాలీ లారీ ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన బాబురావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అర్ధరాత్రి డ్రైనేజీ కాలువలో పడి..

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉడ్‌పేట వద్ద గల డ్రైనేజీలో సోమవారం అర్ధరాత్రి ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ పడిపోయి మృతిచెందాడు. పట్టణ ఎస్‌ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి గ్రామానికి చెందిన బొట్టా సత్తిబాబు అలియాస్ సతీశ్ (35) వివిధ ప్రాంతాల్లో కూలి పనులకు వెళుతుంటారు. కూలీ పని కోసం అనకాపల్లి వచ్చిన సత్తిబాబు సోమవారం అర్ధరాత్రి ఉడ్‌పేట వద్ద డ్రైనేజీ కాలువలో పడిపోయాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి, డ్రైనేజీలో నుంచి సతీశ్‌ను బయటకు తీసి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అనకాపల్లి వచ్చి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తీసుకెళ్లారు. సతీశ్ తండ్రి మహాలక్ష్మినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ తెలిపారు.

## తాండవ కాలువలో మునిగి యువకుడి మృతి

నాతవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండవ కాలువలో పడి యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం నాతవరం గ్రామానికి చెందిన దండు తేజ (31) సోమవారం సాయంత్రం స్థానిక గ్యాస్ గోడౌను ఎదురుగా తాండవ కాలువలో స్నానానికి దిగాడు. ఇక్కడ కాలువ లోతు ఎక్కువ వుండడంతోపాటు తేజకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడకు కొద్ది దూరంలో కల్వర్టు వద్ద మృతదేహం తేలింది. తేజ తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# క్రైం... crime news

## 42 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): ఆటోలో తరలిస్తున్న 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బుచ్చెయ్యపేట చెరకు కాటా వద్ద మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అటుగా వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో 42 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులు పాడేరు నుంచి కేరళకు గంజాయిని తరలిస్తున్నట్టు తెలిసింది.

## స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన డి.ముత్యాలు (44) ఎస్‌ఎంఎస్-1 విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం కన్వర్టర్‌లో ఆయిల్ లీకవుతుండడంతో పరిశీలించేందుకు వెళ్లాడు. కన్వర్టర్ పైనుంచి గ్రేసు కదిలి హుక్ బలంగా తగలడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# గర్భిణికి తప్పని డోలీ మోత



కుర్చీని డోలీలా తయారు చేసి గర్భిణిని గెడ్డ దాటిస్తున్న కుటుంబ సభ్యులు. (ఇన్‌సెట్‌లో) ఆస్పత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చిన కౌసల్య

**పెదబయలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మారుమూల జామిగూడ పంచాయతీ కేంద్రంలో జామిగూడ- గుంజివాడ గ్రామాల మధ్య గల మత్స్య గెడ్డపై వంతెన లేకపోవడంతో గెడ్డ అవతల ఉన్న గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గుంజివాడ గ్రామానికి చెందిన నిండు గర్భిణి అయిన కౌసల్యకు మంగళవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. కౌసల్యను డోలీలో గెడ్డ దాటించడానికి కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. ప్లాస్టిక్ కుర్చీని వెదురు కర్రలకు కట్టి డోలీలా తయారు చేసి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను దాటుకుంటూ అతికష్టం మీద అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించగా వైద్యుల పర్యవేక్షణలో ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. సకాలంలో ఆస్పత్రికి చేర్చడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు డోలీ మోతలు తప్పడం లేదని గుంజివాడ, చింతలవీధి, తారాబు, జడిగూడ, గబ్బర్ల, సరిగిగూడ గ్రామాలకు చెందిన గిరిజనులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయంలో 2.95 కోట్లతో ప్రారంభమైన వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి తమ కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు.

# ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం

... 5వ పేజీ తరువాయి

నీరు చేరింది. వర్షం కారణంగా వారపుసంతలో చిరువ్యాపారులు, కూరగాయలు విక్రయించడానికి వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు.

## పెద్దేరు నుంచి 300 క్యూసెక్కులు విడుదల

**మాడుగుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లుకాగా, ఎగువున ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం సుమారు 600 క్యూసెక్కుల వరద నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతున్నది. దీంతో ప్రాజెక్టు అధికారులు నీటి నిల్వలను క్రమబద్ధీకరిస్తూ మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు స్పిల్‌వే మూడో గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని పెద్దేరు నదిలోకి విడిచిపెడుతున్నారు. నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఏఈ సుధాకరరెడ్డి సూచించారు.

# ఇళ్ల బిల్లులకు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

చేసింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతోపాటు అదనంగా కొంత సొమ్ము ఖర్చు చేసి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. నర్సీపట్నం నియోజకవర్గానికి మొత్తం 3,541 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో నర్సీపట్నానికి 612, గొలుగొండకు 935, మాకవరపాలేనికి 722, నాతవరం మండలానికి 1,272 ఇళ్లు కేటాయించారు. వీటిల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయి, లబ్ధిదారులకు బిల్లులు కూడా అందాయి. అయితే వివిధ కారణాల వల్ల కొంతమంది ఇళ్ల నిర్మాణ పనులను ఆలస్యంగాచేపట్టారు. వీరికి బిల్లులు కావాల్సిన సమయంలో (2019) వైసీపీ అధికారంలోకి వచ్చింది. టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లు కావడంతో రాజకీయ దురుద్దేశంతో హౌసింగ్ బిల్లులు చెల్లించలేదు. ఐదేళ్లపాటు పలువురు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన ఇళ్ల బిల్లుల బకాయిల విషయం తెరపైకి వచ్చింది. గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సర్వే చేసిన అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీని ప్రకారం నర్సీపట్నంలో రూ.56.84 లక్షలు, గొలుగొండ మండలంలో రూ.1.48 కోట్లు, మాకవరపాలెం మండలంలో 1.28 కోట్లు, నాతవరం మండలంలో రూ.1.35 కోట్లు చొప్పున మొత్తం రూ.4.69 కోట్లు లబ్ధిదారులకు అందాల్సి వుంది.

# పుష్కలంగా యూరియా

... 5వ పేజీ తరువాయి

అక్రమాలకు చెక్ పెట్టారు. కాగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మంగళవారం నాటికి జిల్లాకు 13,857 టన్నుల యూరియా వచ్చింది. ఇందులో 106 టన్నుల యూరియా మార్క్‌ఫెడ్ వద్ద (బఫర్ స్టాక్) ఉంది. విశాఖ పోర్టు నుంచి జిల్లాకు తాజాగా ప్రభుత్వం కేటాయించిన 900 టన్నుల యూరియా వచ్చింది. ఇందులో 270 టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయిస్తారు. 630 టన్నులను మార్క్‌ఫెడ్ ద్వారా రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు సరఫరా చేసి గురువారం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్‌కు చెందిన విజయనగరంలోని బఫర్ గోదాము నుంచి మరో 300 టన్నుల యూరియా వస్తుందని అధికారులు చెబుతున్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 122.00 |
| లైవ్ ధర | 142.00 |
| విత్ స్కిన్ | 254.00 |
| స్కిన్ లెస్ | 264.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 540 |
| విజయనగరం | 544 |
| శ్రీకాకుళం | 544 |